ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 25.0





ప్రకృతి గీసిన చిత్రం..

పెదపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆకాశానికి కళాత్మకంగా రంగులను అద్దారా.. అన్నట్లుగా పెదపాడులో బుధవారం ఉదయం ఆకాశం కనువిందు చేసింది. నిర్మలంగా వున్న ఆకాశంలో సీతాకోక చిలుక, హరివిల్లులోని రంగులన్నీ కలబోసినట్లుగా వున్న ఈ దృశ్యాలు చూపరులను మంత్ర ముగ్ధుల్ని చేశాయి.

వామనావతారంలో.. శ్రీవారి దర్శనం



ఎదుర్కోలు ఉత్సవంలో స్వామికి హారతులు

ద్వారకాతిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా దశావతారాల్లోని వామన మూర్తి అలంకారంలో చినతిరుమలేశుడు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో కమండలం, మరో చేతిలో ఛత్రం ధరించి, బలి చక్రవర్తిని అధః పాతాళానికి తొక్కుతున్నట్టు ఉన్న అలంకారం చూపరులకు కనువిందు చేసింది. కాగా గురువారం రాత్రి శ్రీవారి కల్యాణం జరగనుంది.

కాపుసారా..జోరు

- చాట్రాయి మండలంలో యథేచ్ఛగా తయారీ, అమ్మకాలు
- ఎక్సైజ్, పోలీసు అధికారుల పేక్షకపాత్ర
- రోగాల బారిన పడుతున్న మందు బాబులు

చాట్రాయి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాపుసారా తయారీ అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నా, ఎక్సైజ్, పోలీస్ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ ధరలు విపరీతంగా పెంచడంతో చాలామంది కాపు సారాకు బానిసలయ్యారు. దీంతో తయారీ, అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. కాపుసారా తయారీ, అమ్మకం దారులకు లాభాలు వస్తుండటంతో పోలీసులకు దొరికినా బెయిల్‌పై వచ్చి మళ్లీ అదే వ్యాపారం చేస్తున్నారు. మండలంలో అటవీ ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో చాలామంది తయారీదారులు అక్కడే భారీగా కాపుసారా తయారు చేసి, మండలంలోని అన్ని గ్రామాలకు, ఇతర మండలాలకు, పక్క జిల్లాలకు, పట్టణాలకు రవాణా చేస్తున్నట్టు తెలుస్తున్నది. కాపుసారా అతిగా తాగిన వ్యక్తులు లివర్, కిడ్నీ, ఊపిరితిత్తులు వ్యాధుల బారినపడి మృత్యువాత పడుతున్నారు. గతంలో వైన్స్ షాపులు ప్రైవేటు సిండికేట్లు చేతిలో ఉన్నప్పుడు వారు కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేసుకొని, ఎక్సైజ్, పోలీస్ అధికారుల సహకారంతో కాపుసారా తయారీ అమ్మకాలను కొంత వరకు కట్టడి చేసేవారు. గత ఐదేళ్లగా లిక్కర్ షాపులు అన్నీ ప్రభుత్వం చేతిలో ఉండటం, వివిధ కారణాల వల్ల ఎక్సైజ్, పోలీస్ అధికారులు కట్టడి చేయలేక పోవడంతో కాపుసారా వ్యాపారం మూడు ప్యాకెట్లు, ఆరు సీసాలుగా కొనసాగింది. ప్రజల ప్రాణాలకు పెనుముప్పుగా మారిన కాపుసారాను నిర్మూలించడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పోతనపల్లి ఫారెస్ట్‌లో సారా బట్టీలపై పోలీసుల దాడి (ఫైల్)

తొలిరోజు.. మందులేదు!



ఏలూరు ఐఎంఎఫ్ఎల్ డిపోలో మద్యం స్టాక్

- అధికశాతం కొత్త దుకాణాల్లో ప్రారంభంకాని అమ్మకాలు
- ఆశతో ప్రదిక్షణాలు చేసిన మద్యం ప్రియులు
- ధర.. మార్జిన్ విషయంలోను తీవ్ర అసంతృప్తి
- పాత దుకాణాల సరుకంతా వెనక్కి

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కొత్త కొత్త మద్యం దుకాణాలు.. జే బ్రాండ్‌లు పోయి సరికొత్త బ్రాండ్‌లు. అవికూడా తక్కువ ధరకే. ఇంకేముంది ఖుషీ చేసుకోవచ్చు. నింపాదిగా వెళ్ళినా సరుకు రెడీ. ఇదేకదా మాకు కావాల్సింది అనుకున్నారు మద్యం ప్రియులు. కాని అధికశాతం కొత్త దుకాణాల్లో అమ్మకాలు బుధవారం ప్రారంభం కాలేదు. మరికొన్నింటికి ఎక్సైజ్ డిపో నుంచి స్టాక్ వెళ్ళలేదు. ఈ ప్రక్రియ అలస్యం కావడంతో జిల్లా వ్యాప్తంగా మద్యం ప్రియులంతా బారుల మీదే ఆధారపడాల్సి వచ్చింది. దీనికంటే మించి ధరలు తగ్గుతాయని, బ్రాండ్‌లు పెరుగుతాయని సంబరపడిన వారందరికీ తీపి కబురు అందలేదు. గతంలోని ధరలనే మరి కొద్ది రోజులపాటు కొనసాగించబోతున్నారు. ఈ సమాచారమే మద్యం ప్రియులందరికీ షాక్ నిచ్చింది. కొత్త మద్యం విధానంపై రక రకాల ఆశలు పెట్టుకున్న వారందరిని గుక్క తిప్పుకోనీయకుండా చేసింది. పాత ధరలన్నింటిని కొద్ది రోజుల్లోనే సవరిస్తారని అనధికార సమాచారం. జిల్లా వ్యాప్తంగా 144 ప్రైవేటు మద్యం దుకాణాలన్నింటిలోనూ గురువారం నుంచే అమ్మకాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు ఇప్పటికే నిగ్గు తేల్చారు. కొత్త దుకాణాలన్నింటిలోనూ అమ్మకాలు ఆరంభమవుతాయని భావించి అత్యధికులు ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయేంత వరకు దుకాణాల చుట్టూ ప్రదిక్షణలు చేస్తూనే ఉన్నారు. ఒకవైపు స్టాక్ లేకపోవడం, ఇంకోవైపు ధర తగ్గదని తెలిసి కొందరైతే ఆగ్రహంతో ఊగిపోయారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సాగిన 152 ప్రభుత్వం మద్యం దుకాణాలు మంగళవారం రాత్రికే మూత పడ్డాయి. వాటిలో నిల్వ ఉన్న మద్యం స్టాక్‌లను బుధవారం డిపోలకు చేర్చేశారు. అక్కడక్కడ ఉన్న మాల్స్ పూర్తిగా మూతపడ్డాయి. మద్యం దుకాణాలు పొందినవారంతా ఖుషీగానే ఉన్నా వారికి ఇచ్చే మార్జిన్ విషయంలోను ఇంకా స్పష్టత లేకపోవడం, గతంలో 20 శాతం మేర ఉంటుందనే అంచనాలు సగానికి సగం తగ్గిపోయే అవకాశం లేకపోలేదన్న ప్రచారం వీరి ఆనందాన్ని దాదాపు నీరుగార్చింది. ఇప్పటికే ఇన్వాయిస్ అందచేసిన దుకాణదారులు తమకు లభిస్తున్న స్టాక్‌పై ఎంత మార్జిన్ ఉండబోతుందనేది ఆరా తీశారు.



ఏలూరు ఐఎంఎఫ్ఎల్ డిపో నుంచి నూతన మద్యం సరుకును షాపులకు లోడు చేస్తున్న హమాలీలు



ఏలూరు ఐఎంఎఫ్ఎల్ డిపో వద్ద షాపుల పేర్లు ఎంట్రీ చేసుకుంటున్న ఎక్సైజ్ సిబ్బంది



అశోక్ నగర్ సర్కిల్‌లో ప్రారంభం కాని వైన్ షాపు

85 మద్యం షాపులకే మద్యం సరఫరా

ఏలూరు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం విధానంలో జిల్లాకు 144 షాపులు కేటాయించి అందుకు లక్కీడిప్ తీసి లైసెన్సులు మంజూరు చేశారు. బుధవారం నుంచి ప్రైవేటు మద్యం షాపులు వ్యాపారాలు కొనసాగించుకోవాల్సి ఉండగా ఐఎంఎల్ డిపోల నుంచి మద్యం సరఫరాలో కొంత జాప్యం ఏర్పడడంతో రాత్రి వరకు కేవలం 85 షాపులకు మాత్రమే మద్యం సరఫరా చేయగలిగారు. ఏలూరు జిల్లాకు సంబంధించి ఏలూరు, భీమవరం, నిడమనూరు, చాగల్లు, గుడివాడ ఐఎంఎల్ డిపోల నుంచి మద్యం సరఫరా కానుంది. ఏలూరులో డిపో నుంచి 76 మద్యం షాపులు సరఫరా కావాల్సి ఉండగా కేవలం 36 షాపులకు మాత్రమే బుధవారం రాత్రి వరకు సరఫరా చేయగలిగారు. మిగిలిన డిపోలు అన్ని కలిపి జిల్లాకు సంబంధించిన 144 షాపుల్లో 85 షాపులకు మాత్రమే సరఫరా చేయగలిగారు. జిల్లాకు సంబంధించిన మద్యం సరఫరాకు 87 వేల కేసుల వివిధ రకాల బ్రాండ్లలో లిక్కరు, 11 వేల కేసుల వివిధ రకాల బీర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే రూ.99 చీప్‌లిక్కర్ ఇంకా అందుబాటులోకి రాలేదు. ఏలూరు ఐఎంఎల్ డిపో వద్ద లైసెన్సు దారులు క్యూ కట్టి తమ ఇండెంట్లను డిపో మేనేజర్‌కు అందించి తమ లైసెన్సును డిపోలో రిజిస్ట్రేషన్ చేయించుకుని డిపోల నుంచి అందిన సరుకును తీసుకెళ్లారు. ఎక్సైజ్ ఎస్పీ ఎ.ఆవులయ్య, ఏలూరు ఐఎంఎల్ డిపో మేనేజర్ వెంకట్రామిరెడ్డి స్వయంగా పరిశీలన జరిపి వ్యాపారులకు సూచనలు చేశారు. కొంతమంది వ్యాపారులు ముహూర్తాలు చూసుకుని ప్రారంభించడానికి సన్నద్ధమైనట్లు తెలు స్తోంది. శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో అన్ని షాపులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక

జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరుసిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే 2024-25 ఖరీఫ్ పంట కాలంలో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా, ధాన్యం తరలించే వాహనాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జేసీ ధాత్రిరెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో లక్షా 80వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా సుమారుగా 5లక్షల 60వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారని, సుమారు 3.40 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించామని జేసీ తెలిపారు. క్వింటాలుకు కామన్ రకం రూ. 2300, గ్రేడ్-ఏ రకం రూ.2320 చొప్పున కనీస మద్దతు ధరకు రైతుల కళ్లాల వద్దే ధాన్యం సేకరించి సమీప రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని నిర్ణయించామన్నారు.

18 నుంచి రీసర్వేపై గ్రామసభలు

జిల్లాలో ఈనెల 18 నుంచి రీసర్వేపై రెవెన్యూ అధికారులు గ్రామ సభలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలని ఆర్డీవోలను జేసీ ధాత్రిరెడ్డి ఆదేశించారు. తన ఛాంబర్‌లో బుధవారం సివిల్ సప్లయి, రెవెన్యూ అధికారులతో రేషన్ పంపిణీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు రీ ఓపెనింగ్‌పై వచ్చిన అర్జీలు, రీసర్వే గ్రామ సభలు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో ఎక్కువ సమస్యలు ఉన్న మండలాల్లో ఫీడ్ బ్యాక్‌ను తీసుకోవాలని, చింతలపూడిలో చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఏజెన్సీ మండలాల్లో కుల దరఖాస్తులు పెండింగ్ ఎక్కువగా ఉన్నాయని వాటిపై సమీక్ష చేసి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 165 నిర్మాణ ప్రగతిపై సమీక్ష

ఏలూరు రూరల్, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాల మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి 165 నిర్మాణ ప్రగతిపై జిల్లా జేసీ ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. అయా మండలాల్లో భూసేకరణలో భూములు కోల్పోయి ఇంకా నష్టపరిహారం కోసం క్లయిమ్‌లు దాఖలు చేయని, రైతుల నుంచి క్లయిమ్‌లు సేకరించాలని తహసీల్దార్లను ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న జేసి ధాత్రిరెడ్డి

32 ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు

- ధరల నియంత్రణకు కొత్త తరహా విధానం
- సబ్సిడీ ధరలకు పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్
- బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకే కందిపప్పు పంపిణీ

ఏలూరుసిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో ఆయిల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతు న్నాయి. బియ్యం ధరలు మండిపోతున్నాయి. గత ప్రభుత్వ వైఫల్యంతో మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గతంలో నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించక పోవడంతో ఇప్పటికీ ధరలు అందుబాటులోకి రాని పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో కందిపప్పు కిలో రూ.200లకు కూడా అమ్మకాలు జరిగిన పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిత్యావసర సరకులు ధరలను నియంత్రించాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొదటగా అతి ముఖ్యమైన ఆయిల్ ధరలను నియంత్రించడానికి ప్రత్యేక కౌంటర్లు ద్వారా సబ్సిడీ ధరలకు ఆయిల్ ప్యాకెట్లను వినియోగదారులకు అందిస్తోంది. ఈ ధరలను నియంత్రించడానికి చౌకడిపో దుకాణాల్లో అందించే సరుకులతో పాటు జిల్లాలో ప్రత్యేకంగా 32 కౌంటర్లు ఏర్పాటు చేసి పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్స్, తక్కువ ధరకు కందిపప్పు అందిస్తున్నారు. ఏలూరులోని రెండు రైతు బజార్లు, నూజివీడు, కైకలూరులోని రైతు బజార్లు ద్వారా మోర్, డిమార్ట్, రియలన్స్ మార్టులకు సంబంధించి 11 చోట్ల, మిగిలినవి చింతలపూడి, జంగారెడ్డిగూడెంతో పాటు ఇతర మండల కేంద్రా ల్లో మొత్తం 32 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అయిల్స్, బియ్యం, కందిపప్పు సరుకులను బహిరంగ మార్కెట్‌కన్నా తక్కువగా అందిస్తున్నారు. జిల్లాలోని హోల్ సేల్ ఆయిల్స్, నిత్యావసర సరుకుల అమ్మే హోల్‌సేల్ వర్తకులతో మాట్లాడి ఈ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా ఒక్కో రేషన్ కార్డుదారునికి నెలలో ఒక ప్యాకెట్ సన్ ఫ్లవర్ ఆయిల్, మూడు ప్యాకెట్లు పామాయిల్‌ను సబ్సిడీ ధరలకు అందిస్తున్నారు. సన్ ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ రూ.124 చొప్పున, పామాయిల్ ప్యాకెట్ రూ.110 చొప్పున అందజేస్తున్నారు. కందిపప్పు కిలో రూ.150, సూపర్ ఫైన్ బియ్యం కిలో రూ.47లకు ఈ ప్రత్యేక కౌంటర్లలో అందజేస్తున్నారు. ఇవిగాక చౌకడిపోల ద్వారా సబ్సిడీ ధరకే కందిపప్పు, పంచదార, ఉచితంగా బియ్యం అందజేస్తున్నారు.



సక్రమంగా నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రతినెలా 1వ తేదీ నుంచే నిత్యా వసర సరుకులు పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జేసీ ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జేసీ అధ్యక్షతన పౌర సరఫరాల శాఖాధికారులు, సిబ్బంది, చౌక డిపోల డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు, మొబైల్ డిస్పెనింగ్ యూనిట్ ఆపరేటర్లు (ఎండీయూ), ఆయిల్ వర్తక సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు.

సాగునీటి సంఘాల ఎన్నిక వాయిదా

నర్సాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సాగునీటి సం ఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. షెడ్యూల్ ప్రకారం బుధ వారం నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. తుఫాన్ కారణంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటం అధికారయం త్రాంగమంతా సహాయ, పునరావాస పనుల్లో నిమగ్నమై ఉండటంతో ప్రభుత్వం వాయిదా వేసింది. ఎన్నికలు తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయం తెలియాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.



ఈ నగరానికి ఏమైంది ?

ఏలూరు నగరంలో నిఘా వైఫల్యంతో అల్లరి గ్యాంగులు చెలరేగుతున్నాయి. శాంతి భద్రతలు అదుపు తప్పడంతో ప్రజలు తీవ్ర అలజడికి గురవుతున్నారు. 7లో..



స్లూయిస్, ఏటిగట్టు పనులకు మోక్షం

14 ఏళ్లుగా పెండింగ్‌లో వున్న అవుట్‌పాల్ స్లూయిస్ నిర్మాణ పనులకు, అసంపూర్తిగా మిగిలిన ఏటిగట్టు ఎత్తు పనులకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ రూ. 16 కోట్లు విడుదల చేసింది. 7లో..



విద్యాశాఖలో కలకలం

50 శాతంకంటే తక్కువ విద్యార్థులు హాజరవుతున్న 53 హైస్కూల్స్ హెచ్‌ఎంలు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని విద్యాశాఖ జారీ చేసిన మెమో కలకలం రేపుతోంది. 6లో..

కొనసాగుతున్న వర్షాలు

- అల్పపీడన ప్రభావం అంతంతే..
- ఊపిరి పీల్చుకున్న రైతులు

ఏలూరు సిటీ/పోలవరం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారినా ఆ ప్రభావం జిల్లాపై అంతంత మాత్రంగానే ఉండడంతో సార్వా సాగు చేసే రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే జిల్లాలో వర్షాలు మాత్రం కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో జంగారెడ్డిగూడెం మండలంలో 11.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమో దైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 1.8 మి.మీగా నమోదైంది. ఉంగుటూరులో 6.2, చింతలపూడిలో 6.2, కామవరపుకోటలో 3.8, దెందులూరులో 3.2, జీలుగు మిల్లిలో 3.2 వేలేరుపాడులో 3 మి.మీ వర్షపాతం నమోదైంది. పోలవరం మండలంలో కొత్తపట్టిసీమ, గూటాల, పట్టిసీమ, ఎల్ఎన్‌డీపేట, చేగొండపల్లి, కొండ్రుకోట పునరావాస కాలనీల్లో చిరు జల్లులు కురిశాయి.

జల్లేరు జలాశయం నుంచి సాగునీరు విడుదల

బుట్టాయగూడెం, అక్టోబరు 16 : (ఆంధ్రజ్యోతి) : గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం నుంచి బుధవారం ఆయకట్టు భూములకు స్థానిక నాయ కులు జలహారతి ఇచ్చి సాగునీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేతుల మీదుగా నీటిని విడుదల చేయాలని భావించినా ఇతర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బిజీగా ఉండడంతో స్థానిక నాయకులే నీటిని విడుదల చేశారు. ఏటా రెండవ పంటకు జలాశయం నుంచి సాగునీటిని ఇరిగేషన్ అధికారులు ఆయకట్టు భూములకు అందజేస్తున్నారు. ఇరిగేషన్ ఏఈ సురేష్, సర్పంచ్ తెల్లం రాముడు, ఉప సర్పంచ్ మద్దిపాటి శ్రీను కూటమి నాయకులు పాల్గొన్నారు.

తమ్మిలేరు ప్రాజెక్టు వద్ద అమృత్ 2.0 పథకం కోసం సర్వే

చింతలపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీకి మంజూరైన అమృత్ 2.0 పథకం కోసం కలెక్టర్ ఆదేశాలతో నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు ప్రాజెక్టు వద్ద అధికారుల బృందం జాయింట్ సర్వే బుధవారం జరి పింది. ఈ పథకంలో రిజర్వాయరు నుంచి నగర పంచాయతీకి కావాల్సిన మంచి నీటి సరఫరా ఆవశ్యకత, ప్లాంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు కావాల్సిన స్థల సేకరణపై సర్వే జరిపారు. రూ.48.82 కోట్లతో ఈ పథకం అమలు కానుంది. ఈ సర్వేలో ఇరి గేషన్ ఎస్ఈ దేవప్రకాశ్, పబ్లిక్ హెల్త్ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈఈ ఫణి భూషణరావు, మునిసిపల్ కమిషనర్ బి.పావని, ఇరిగేషన్ ఏఈ పరమానందం, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఫణికుమార్, మునిసిపల్ ఏఈ శ్రీను పాల్గొన్నారు.



తమ్మిలేరు ప్రాజెక్టు వద్ద అధికారుల బృందం సర్వే

జీతాలివ్వండి..మహాప్రభో

'గత వైసీపీ ప్రభుత్వం మా పట్ల చిన్న చూపు చూసింది. ఏడునెలలుగా జీతం లేదు. జీతాలు ఇవ్వకపోతే మా కుటుంబం ఏం తిని బతకాలి. కూటమి ప్రభుత్వమైనా జీతం ఇచ్చి పుణ్యం కట్టుకోండి.'..

- ఏలూరు రూరల్ పంచాయతీకి చెందిన ఓ పంచాయతీ కార్మికురాలి వేదన.

'మా కష్టానికి ఫలితంగా ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వకుండా గత వైసీపీ ప్రభుత్వం ఇబ్బందుల పాలు చేసింది. కూటమి ప్రభుత్వం స్పందించి మాకు రావాల్సిన జీతాలు ఇచ్చి ఆదుకోవాలి'..

- ఏలూరు రూరల్ పంచాయతీకి చెందిన మరో కార్మికుడి గోడు ఇది.

పంచాయతీ పారిశుధ్య కార్మికుల ఆవేదన

ఏలూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉండాలని, వేకువ జాము నుంచే పనిలోకి వచ్చి ఒళ్ళు వంచి పని చేస్తున్న చేతికి జీతం అందడం లేదు. ఒక్కరోజు వారు పనిచేయకపోతే రోడ్లపై నడవలేని పరిస్థితి, వందలాది కుటుంబాల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను సేకరించి ఊరి బయటకు తరలిస్తున్నారు. అలాంటి పంచాయతీ కార్మికులకు కొందరికి ఏడునెలలు, మరికొందరికి పది, ఇంకొందరికి 12 నెలలు అందక ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో పంచాయతీ పారిశుధ్య కార్మికుల పట్ల చిన్నచూపు చూడడంతో జీతాలు లేక ఇబ్బందులు పడ్డారు. దీంతో వారు కూటమి ప్రభుత్వంపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీలో ఆదాయం వస్తున్నా జీతాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తమ గోడును అధికారుల దృష్టికి తీసుకెళ్లితే నిధులు లేవని, ఇస్తామని డొంక తిరుగుడు మాటలు చెబుతున్నారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 547 పంచాయతీల్లో సుమారు 3 వేల మందికి పైగా పంచాయతీ పారిశుధ్య కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. జీతాలు ఇవ్వాలని పంచాయతీ కార్మికులు, అధికారులను వేడుకొంటున్నారు. 'నామమాత్రపు జీతాలతో పని చేసే పంచాయతీ కార్మికులు నెలల తరబడి జీతాలు బకాయిల వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. బకాయి జీతాలు చెల్లించి కార్మికుల ఆకలి బాధలు తీర్చాలి' అంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య డిమాండ్ చేశారు.

పాపికొండల విహారం అంటే ఎగిరి గంతేస్తారు.. ఎత్తైన కొండల మధ్య నుంచి గలగల పారుతున్న గోదారి అందాలను బోటులో వెళుతూ తిలకించడం అంటే ఎవరు మాత్రం ఇష్టపడరు..పాపికొండల అందాలను చూసేందుకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు.. వివిధ కారణాల వల్ల ఇటీవల పాపికొండల విహారానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి.. దీంతో పర్యాటక ప్రియులు కాస్తంత నిరాశకు గురవుతున్నారు .. - పోలవరం

గోదారి అందాలు చూసేదెలా ?

పర్యాటకం



పాపికొండల మధ్య బోటులో విహారం

ఏలూరు జిల్లాలోనూ బోట్ పాయింట్ ఏర్పాటు చేయాలి



గతంలో పోలవరం నుంచి బోట్లు బయలుదేరేవి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందు పోల వరంలో ఒక బోట్ పాయింట్, సింగన్నపల్లిలో ఒక బోట్ పాయింట్ ఉండేవి.అప్పుడు పర్యాటకులకు లాడ్జీలు, భోజన సదుపాయాలు, ఇతర మౌళిక వసతులు పోలవరంలో అందు బాటులో ఉండేవి. ప్రాజెక్టు నిర్మాణంలో అవి తొలగించడంతో ఇప్పుడు అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పోశమ్మ గండిలో ఉండడం వల్ల రాజమహేంద్రవరం మీదుగా పర్యాటకులు ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పర్యాటకులు హైదరాబాదు నుంచి పోలవరం డైరెక్టుగా బస్సుకి వచ్చి పోలవరంలో బస చేసి పర్యాటకానికి వచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఎగువ కాఫర్ డ్యాం వద్ద ఏలూరు జిల్లాకి బోట్ పాయింట్ ఏర్పాటు చేస్తే పరిస్థితులు మెరుగవుతాయి.

- ఎస్‌కె సంధాని, పర్యాటక బోటు నిర్వాహకుడు, పోలవరం

ఎగువ కాఫర్ డ్యాం మీదుగా బోటింగ్ ఏర్పాటు చేయాలి



పాపికొండల పర్యటన అంటేనే ప్రకృతి అందాల వీక్షణ. అలాంటిది పాపికొండల ఎగువ నుంచి భద్రాచలం, కూనవరం, కొయిదాల మీదుగా బోటింగ్ ఏమాత్రం ఆస్వాదంగా ఉండడం లేదు. ప్రాజెక్టు మీదుగా ఎగువ కాఫర్ డ్యాం మీదుగా పర్యాటకం ఏర్పాటు చేస్తే ఇటు ప్రాజెక్టు వీక్షణతో పాటు పాపికొండలు చూడవచ్చు. పర్యాటకశాఖ అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకుంటే పర్యాటకం అభివృద్ధి చెందుతుంది.

- కోటిచుక్కల సుబ్రహ్మణ్యం, పర్యాటకుడు

పాపికొండల విహారానికి అడ్డంకులు

ఐదేళ్ల క్రితం కచ్చులూరు బోటు ప్రమాద సంఘటన అనంతరం బోటు పర్యటనకు దీర్ఘకాలం బ్రేక్ పడింది. అప్పటి నుంచి పర్యాటకుల సంఖ్య కూడా తగ్గింది. సౌకర్యాల లేమి వల్ల, అన్ని వైపుల నుంచి అవాంతరాల కారణంగా పాపికొండల పర్యటన దాదాపు పడకేసే పరిస్థితికి తీసుకువచ్చాయి. 2017లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యాటకంపై దృష్టి సారించి పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పార్కు నిర్మాణం, పాపి కొండల టూరిజంలో కంట్రోల్ రూంలు, అటవీశాఖ ఆధ్వర్యంలో రిసార్టులు, ఉడెన్ హౌస్‌ల నిర్మాణానికి కృషి చేశారు. సుమారు రూ. 2 కోట్లతో కొరుటూరు గ్రామం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో 5 ఉడెన్ రిసార్టులు, 14 తాత్కాలిక టెంట్లను ఏర్పాటు చేశారు. 2021 సంవత్సరంలో వాటిని ప్రారంభించారు. పోలవరం మండలం శింగన్నపల్లి, దేవీపట్నం మండలం పోశమ్మగండి, పేరంటాలపల్లి, పోచవరం ఈ నాలుగు ప్రాంతాల్లో పర్యాటకుల కోసం కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా శింగన్నపల్లి వద్ద ఉన్న కంట్రోల్ రూమ్‌ను తొలగించి పోలవరం ప్రాజెక్టు చెక్‌పోస్టు వద్దకు తరలించారు. ఆ కంట్రోల్ రూం నిర్వహణ లోపం వల్ల అక్కడే శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఏలూరు జిల్లాలో పోలవరం మండ లంలో శింగన్నపల్లి, పోలవరం బోట్ పాయింట్‌ల నుంచి ప్రారంభమయ్యే పాపికొండల పర్యటనకు తెరపడింది. ఇక పోశమ్మగండి కంట్రోల్ రూం నుంచి బయలు దేరే టూరిజం బోట్లు వర్షాకాలంలో దీర్ఘకాల విరామం తీసు కోవడం వల్ల, ప్రాజెక్టు భద్రతా కారణాల వల్ల అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండడంతో పర్యాటకం కొంత సన్నగిల్లింది. ఆ కంట్రోల్ రూం సైతం నిర్వహణ లేక శిథిలావస్థకు చేరు కోవడంతో పోశమ్మగండి కొండపై ఏర్పాటు చేశారు. ఐతే ఆ కంట్రోల్ రూం పర్యాటకుల సేద తీరడానికి అనువుగా లేకపోవడం బోట్ పాయింట్‌కి దూరంగా ఉండడం, బాత్‌రూం సౌకర్యాలు,మంచినీటి సదుపాయం లేక పోవడం కారణంగా పర్యాటకుల దానిని వినియోగించుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. తూర్పు గోదావరి జిల్లా రంప చోడ వరం నుంచి గతంలో రాకపోకలు ఉన్నప్పటికీ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావం వలన ఆ మార్గం పూర్తిగా నీటితో మునిగి ఉండడం వలన అటు రాకపోకలు బంద్ అయ్యాయి.



అటవీశాఖ ఉడెన్ కాటేజీలు

పోచవరం, కూనవరం నుంచే అవకాశం

పేరంటాలపల్లి గ్రామానికి పాపికొండల పర్యటనకు నేరుగా రాకపోకలు సాగించడానికి పోచవరం కూనవరం ప్రాంతాల నుంచి నదీ మార్గం మాత్రమే ఉండడం వల్ల అటు నుంచి మాత్రమే పాపికొండ పర్యాటక టూరిజం కొనసాగుతోంది. పోచవరం నుంచి ఒక ఏపీ టూరిజం బోటు, 15 ప్రైవేటు బోట్లు రాక పోకలు సాగిస్తుండగా, పోశమ్మ గండి నుంచి 1 ఏపీ టూరిజం బోటు, 14 ప్రైవేటు బోట్లు రాకపోకలు సాగిస్తున్నాయి. గతేడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది జూలై వరకూ పాపికొండల పర్యటన కొనసాగింది. ఏలూరు జిల్లా వైపు పర్యాటకం అభివృద్ధి చెందాలంటే ఎగువ కాఫర్‌డ్యాం వైపు ఒక కంట్రోల్ రూం, పోల వరంలో బోట్ పాయింట్ ఏర్పాటు చేసి పోలవరం ప్రాజెక్టుపై గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ప్రకారం ప్రాజెక్టుపై పార్కు ఏర్పాటు చేస్తే బావుంటుందని పలువురు పర్యాటక ప్రియులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో వన్య ప్రాణులకు హాని



పోలవరం ప్రాజెక్టు ఎగువ నుంచి పాపి కొండల అభయారణ్యం విస్తరించి ఉంది. పర్యాటకం పేరిట వెళుతున్న టూరిజం బోట్ల వల్ల ప్లాస్టిక్ వ్యర్థాలు నదీ తీరాల వెంబడి ఉండడం వల్ల వన్య ప్రాణులకు హాని జరిగే అవకాశాలు ఎక్కువ. అంతేగాక , టూరిజం బోట్లలో వినియోగించే డీజే సౌండ్ సిస్టం వల్ల వన్యప్రాణుల స్వేచ్ఛకు విఘాతం కలుగుతోంది. అందుకే పాపికొండల పర్యాటకులకు, బుకింగ్ ఏజన్సీలకు, సంబంధిత అధికారులకు ప్లాస్టిక్ వినియోగం, శబ్ద కాలుష్యం నివారణకు నోటీసులు ఇస్తున్నాం. పర్యాటకులు, బోట్ల నిర్వాహకులు వన్యప్రాణులకు ప్రాణహాని, స్వేచ్ఛా భంగం కలిగేలా కాటేజీల వద్ద, వనాల్లో కాలుష్యం చేయరాదు.

- ఎస్‌కె వలీ, అటవీ క్షేత్రాధికారి పోలవరం రేంజ్

ఆధ్యాత్మిక శోభ





విద్యుద్దీపాల కాంతుల్లో తూర్పురాజగోపురం.. కల్యాణ వేదికను తీర్చిదిద్దుతున్న సిబ్బంది..

కల్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధం

నేటి రాత్రి 8 గంటల నుంచి చిన వెంకన్న కల్యాణం

ద్వారకాతిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని దివ్య కల్యాణ మహోత్సవానికి దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. అనివేటి మండపంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపాన్ని ముస్తాబు చేస్తు న్నారు. పూల అలంకరణ పనులు గురువారం సాయంత్రానికి పూర్తవుతాయని ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. శ్రీహరి కళా తోరణ వేదికపై ప్రతీ నిత్యం వివిద సాంస్కృ తిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. స్వామి వారి తిరువీధి సేవకు వినియోగించే వెండి గరుడ వాహనాన్ని ఇప్పటికే సిద్ధం చేశారు. గురువారం రాత్రి 8-00 గంటలకు ప్రారంభ మవుతుందని ఈవో తెలిపారు.

హనుమద్వాహనంపై శ్రీవారు..

భక్తవరదుడైన శ్రీవారు హనుమద్వాహనాన్ని అధిష్టించి బుధవారం ఉదయం తిరువీధుల్లో ఊరేగారు. ధనుర్బాణాలను ధరించి రామావతారంలో కొలువుతీరిన శ్రీవారు హనుమంత వాహనంపై భక్తజన రంజకంగా తిరువీధుల్లో ఊరేగారు.



నేత్రపర్వం.. ఎదుర్కోలు మహోత్సవం

స్వామివారి కల్యాణానికి ముందురోజున ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయం. శ్రీవారి ఆలయ ఆవరణలో వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో స్వామి నిత్యకల్యాణ వేదిక వద్దకు వచ్చారు. అర్చకులు హారతులిచ్చి ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. మండపంలో అర్చకులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడి పోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, కొనియాడగా రెండవ జట్టు అమ్మవార్ల గుణ గణాలను తెలియజేశారు.వివాహం జరిగే ముందురోజు వధూవరుల తరపు బంధువులు శుభలేఖను పఠించేందుకు జరిపే కార్యక్రమమే ఎదుర్కోలు ఉత్సవం. రాత్రి వెండిశేష వాహనంపై స్వామివారు ఊరేగారు..

కన్నుల పండువగా కాళ్లకూరు వెంకన్న కల్యాణం





కాళ్ళ అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గోవింద నామస్మరణతో కాళ్ళకూరు మారుమోగింది. కాళ్ళ మండలం కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజ మాస లఘు కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. అరంగంటి ఝాన్సీ లక్ష్మీ కుమారులచే ఆలయ అర్చకులు, వేదపండితులు అనిపెద్ది ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణం నిర్వహించారు. వివాహాల సీజన్ కావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో అరుణ్‌కుమార్ ఏర్పాట్లు చేశారు.

110 కేజీల లడ్డూ వేలం





లడ్డూ అందజేస్తున్న కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : దసరా మహోత్సవాలలో భాగంగా జంగారెడ్డిగూడెం గంగానమ్మ ఆలయంలో బుధవారం భారీ అన్నదానం జరిగింది. ఈ సందర్బంగా అమ్మ వారి 110 కేజీల లడ్డూను నడింపల్లి అంజనారావు రూ లక్షా ఇరవై ఐదు వేల రూపాయలకు వేలంలో దక్కించు కున్నారు. 90 కేజీల లడ్డూను వాసవీ సాయి నగేష్ రూ.యాభై ఐదు వేల రూపాయలకు దక్కించుకున్నారు. పన్నెండు వేల మందికి అన్న సమా రాధన నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు కలగర వీర్రాజు తెలిపారు. కరాటం రాంబాబు, జెట్టి గురునాథరావు, డికెడి సత్యనారాయణ, పరిమి సత్తిపండు, రాఘరి కృష్ణ, పెనుమర్తి రామకుమార్, రాజాన పండు, పాలపర్తి శ్రీనివాస్, మహంకాళి రాంబాబు, వందనపు వెంక టేశ్వరరావు, ఉక్కుర్తి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

సగం మంది విద్యార్థులు కూడా రాకపోతే ఎలా ?!

వివరణ కోసం 53 హైస్కూళ్ల హెచ్‌ఎంలకు పిలుపు

ఫలితం చూపని ఏడుగురు ప్రధానోపాధ్యాయులకు డీఈవో క్లాసు

విద్యాశాఖ తీరుపై ఏపీటీఎఫ్ విస్మయం



ఏలూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యార్థుల హాజరు 50 శాతం కంటే తక్కువగా వున్న 53 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా జిల్లా విద్యాశాఖ జారీచేసిన మెమో ఉత్తర్వులు బుధవారం ఉపాధ్యాయ వర్గాల్లో కలకలం రేపాయి. మంగళవారం రాత్రి జారీచేసిన మెమో ఉత్త ర్వులకు వేగంగా స్పందించిన 46 హైస్కూళ్ళలో బుధ వారమే విద్యార్థుల హాజరును హెచ్‌ఎంలు, టీచర్లు సంతృప్తికర స్థాయికి పెంచగా, మిగతా 7 ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను మాత్రం వివరణ నిమిత్తం డీఈవో కార్యాలయానికి బుధ వారం సాయంత్రం పిలిపించుకుని మాట్లాడారు. ఈ విషయంకాస్తా ఉపాధ్యాయ సంఘాలకు తెలియడంతో విద్యాశాఖ తీరుపై విరుచుకు పడ్డాయి. ఓ వైపు పాఠశాలల్లో విద్యార్థుల ఆదార్ అప్‌డేషన్, అపార్ నెంబర్లకోసం కంప్యూటర్ సెంటర్ల చుట్టూ తిరుగుతుంటే హాజరు తక్కువగా ఉందంటూ విద్యాశాఖ అధికారులు మానసికంగా వేదించడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు రామారావు, రెడ్డిదొర మండిపడ్డారు. పిల్లలను పాఠశాలకు పంపాల్సిన బాధ్యత తల్లితండ్రులదేనని, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు కాకుండా బోధనకే ఉపయోగించాలని డిమాండ్ చేశారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థులు, టీచర్ల హాజరుపై రెండువారాల క్రితం జిల్లాలవారీగా విద్యాశాఖ ఉన్నతాధి కారులు సమీక్షించి ఎక్కడెక్కడ లోపాలు వున్నదీ స్పష్టత నిస్తూ, దసరా సెల వులు ముగిసిన తర్వాత ఈ లోపాలను సరిదిద్దాలని డీఈవోలకు సూచించారు. ఆ ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 2.65 లక్షల మంది బాల, బాలికలు చదువుతుండగా, వీరిలో సుమారు 67 వేలమంది రోజూ ఏదో ఒక కారణంతో గైర్హాజర వుతున్నట్టు గుర్తించినట్టుగా వివరించారు. అదే సమయంలో జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యా యుల్లో దాదాపు 100 మంది నిత్యం పాఠశాల తరగతులు ప్రారంభ మయ్యే ఉదయం 9 గంటల్లోగా ముఖ ఆధారిత గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) హాజరు వేయకుండా, 9.30 గంటల సమయంలో హాజరు వేయడాన్ని గైర్హాజరుగానే పరిగణిస్తామన్నారు. ఈ నేపథ్యంలో దసరా సెలవులు ముగియడంతో విద్యార్థుల హాజరుపై తొలుత జిల్లావిద్యాశాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే జిల్లాలో 53 హైస్కూళ్ళలో విద్యార్థుల హాజరు 50 శాతం కంటే తక్కువగా వున్నట్టు గుర్తించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల హాజరును పెంచడానికి హెచ్‌ఎంలను బాధ్యులుగా చేయాలని భావించింది. వరుసగా నాలుగు రోజులు స్కూలుకు గైర్హాజరయ్యే విద్యార్థి తల్లితండ్రులకు క్లాసు టీచరు నేరుగా ఫోన్ చేసి తెలియజేయాలని విద్యాశాఖ సూచించింది.

90-95 శాతం హాజరు ఉండాల్సిందే : డీఈవో

"విద్యార్థుల హాజరుశాతం 50 శాతం కంటే తక్కువగా వున్న 53 పాఠశాలల హెచ్‌ఎంలను వివరణ కోరాం. వీరిలో 46 స్కూళ్ళ ప్రధానోపాధ్యాయులు బుధవారం నాటికి ప్రగతి కనబరిచారు. మిగతా ఏడు హైస్కూళ్ళ హెచ్‌ఎంలను పిలిపించి మాట్లాడాం. దసరా సెలవుల మరసటి రోజులైనందున విద్యార్థుల హాజరు తక్కువగా ఉందని వివరణ ఇచ్చారు. ఇకమీదట ఇలా జరుగకుండా చూడాలని సూచించాను. ఇంతటితో ఈ సమస్య ముగిసినట్టే. అయితే ప్రతీ పాఠశాలలో 90 నుంచి 95 శాతం వరకు విద్యార్థుల హాజరుండేలా చూడాల్సిన బాధ్యత స్కూలు హెచ్‌ఎంలదే. దీనిపై ఇకమీదట కూడా పర్యవేక్షణ కొనసాగుతుంది. ఉపాధ్యాయుల హాజరు వారి జీతంతో ముడిపడి వున్నందున సకాలంలోనే హాజరు వేయాల్సి ఉంటుంది. టీచర్లలో ఒకశాతం మంది సకాలంలో హాజరు వేయడం లేదని గుర్తించాం. దీనిని సరిచేసుకుంటారని ఆశిస్తున్నా." అని డీఈవో అబ్రహం వివరణ ఇచ్చారు.



టాటా విగ్రహాన్ని రూపొందిస్తున్న శిల్పి కరుణాకర వడయార్

రతన్ టాటా..

పెనుమంత్ర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పారిశ్రామిక వేత్త భారత దేశంలోనే అత్యధిక పరిశ్రమలు నెలకొల్పి ఎందరికో ఉపాధి కల్పించిన వ్యాపార దిగ్గజం రతన్ టాటా ఇటీవల మృతి చెందారు. యువతకు ఆయన ఘనతను చాటి చెప్పేందుకు ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు భీమవరం ముఖ ద్వారం వద్ద పెదఅమిరంలో టాటా విగ్రహం ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. పెనుమంత్రలోని ఏకే ఆర్ట్స్ శిల్పులకు విగ్రహాన్ని ఆర్డర్ ఇచ్చారు. జీవ కళ ఉట్టిపడే విధంగా టాటా విగ్రహాన్ని శిల్పి డాక్టర్ కరుణాకర వడయార్ రూపొందిస్తున్నారు. ఆయన విగ్రహం తయారు చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని వడయార్ తెలిపారు.



నాడు

పల్లె పండుగ మొదలైంది..



నేడు

అభివృద్ధి పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. పల్లెల అభివృద్ధి దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. వరదలకు, వర్షాలకు ధ్వంసమైన రోడ్లు, గ్రామాల్లో అంతర్గతంగా సీసీ రోడ్లను నిర్మించేందుకు కార్యక్రమాలు చేపడుతూనే గోతులు పడిన రోడ్లకు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలంలోని దండగర్రలో పెద్ద పెద్ద గోతులతో వాహన చోదకులను ఇబ్బంది పెడుతున్న రహదారికి మరమ్మతులు చేయించారు. ఇంతకాలం నరకం చూశామని ఇప్పటికి ఈ రోడ్డుకు మోక్షం కలిగిందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు స్థానికులు కృతజ్ఞతలు చెబుతున్నారు. **-తాడేపల్లిగూడెం రూరల్**

స్పోర్ట్స్ కాలమ్



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు

యోగాలో రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

ఉంగుటూరు/టి.నరసాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన యోగాసన పోటీల్లో ప్రతిభ చూపి తమ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని కైకరం హైస్కూలు హెచ్‌ఎం గుళ్ళ ప్రసాద రావు తెలిపారు. పాతినించి నాగరాజు, ఉప్పాడ రేవంత్ వసంతకుమార్‌లు నవంబరులో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వెళతారన్నారు. వ్యాయామ ఉపాధ్యా యులు జి.నాగసుధ, పాపాయమ్మ, ఉపాధ్యాయులు తల్లితండ్రుల కమిటీ అభి నందించారు. టి.నరసాపురం మండలం కేతవరం హైస్కూల్ 6వ తరగతి విద్యార్థి పంతగాని ధనుష్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అప్పారావు తెలిపారు. బుధవారం పాఠశాల్లో విద్యార్థిని అభినందించారు. అండర్-14 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రమేష్,యోగా ఇన్‌స్ట్రక్టర్ వెంకటేశ్వర రావులను, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గంటా బుజ్జి బాబు అభినందించారు.



ఎంపికైన విద్యార్థి ధనుష్

వెయిట్ లిఫ్టింగ్‌లో ఏలూరు విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లో ఈనెల 6 నుంచి 13 వరకు రెయిన్‌బో ఇంటర్నే షనల్ స్కూల్ ప్రాంగణంలో యూత్ జూనియర్, సీనియర్ జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఏలూరు సాయి సెంటర్‌కు చెందిన బాలికలు పతకాలు సాధించారని సెంటర్ ఇన్‌చార్జ్ వినాయక ప్రసాద్ తెలిపారు. జూనియర్ మహిళల విభాగంలో పి.దివ్య రజత పతకం, యూత్ విభాగంలో రీనోమోల్ కాంస్య పతకం సాధించారని తెలిపారు. విజేతలను కోచ్ వి.ఉదయ్ సందీప్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ వి.శ్రీనివాస్, వెయిట్‌లిఫ్టింగ్ ఇండియన్ సమాఖ్య ఉపాధ్యక్షుడు బి.వెంకట రామయ్య, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి టి.దిన్నాబాబు అభినందించారు.

టి-20 కెప్టెన్‌గా వాండ్రం కుర్రోడు తిలక్‌వర్మ

గ్రామంలో ఆనందోత్సాహాలు



ఉండి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):వాండ్రం కుర్రోడు తిలక్‌వర్మ టి-20 కెప్టెన్‌గా ఎంపిక వడంపై ఉండి మండలం వాండ్రం గ్రామంలో ఆనందోత్సవాలు వ్యక్తమవుతున్నాయి. బుదవారం భారత్ జట్టును బీసీసీఐ ప్రకటిం చింది. అక్టోబరు 18 నుంచి ఒమన్ వేదికగా ఎమర్జింగ్ ఆసియా కప్ జరుగనుంది. టి-20 ఫార్మాట్‌లో జరుగునున్న ఈ టోర్నీకి 15 మందితో భారత జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు పశ్చిమ గోదావరి జిల్లా వాండ్రం గ్రామం కుర్రోడు సారధ్యం వహించడంతో గ్రామంలో, మండలంలోని ప్రజలు, క్రికెట్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన భూపతిరాజు సుబ్బరాజు సుందరమ్మల మనవడు తిలక్‌వర్మ. వర్మ తల్లిదండ్రులు గాయిత్రీ దేవి, నాగరాజు హైదరాబాద్‌లో నివాసం వుంటున్నారు. గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అభినందనలు తెలిపారు. తన మనువడు భారత జట్టుకు సారధ్యం వహించడంపై తాత, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

» జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ సమీక్ష

ఏలూరు సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జడ్పీ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం సమీక్ష నిర్వహించారు. పనులను వేగవంతం చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను సూచించారు. జడ్పీ సీఈవో కేఎస్ఎస్.సుబ్బారావు, భీమవరం, జంగారెడ్డి గూడెం, రాజమండ్రి, నరసాపురం, కొవ్వూరు డివిజన్ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యు ఎస్ అధికారులు పాల్గొన్నారు.



వసతి గృహం పరిశీలిస్తున్న న్యాయాధికారి

వసతి గృహాల్లో పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

» న్యాయాధికారి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వసతి గృహం ఆవరణలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని వంటశాల, స్నానాల గదుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని వసతి గృహ అధికారులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి పురుషోత్తమకుమార్ ఆదేశాల మేరకు రత్నప్రసాద్ ఏలూరు రైల్వే స్టేషన్ సమీపంలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులరు వసతులపై ఆరా తీశారు. వసతి గృహ పరిశుభ్రత, మంచినీరు, ఆహారం, వైద్యం, రక్షణ సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత మరింత మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులకు న్యాయ సహాయం కావాల్సి వస్తే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాజబాబు పాల్గొన్నారు.

● కలిదిండి: కలిదిండిలో బీసీ బాలికల హాస్టల్, ఎస్సీ బాలుర హాస్టల్, కోరుకొల్లులో ఎస్సీ బాలికల హాస్టల్‌ను మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ వీవీఎన్‌వీ లక్ష్మి తనిఖీ చేశారు. భోజనం, వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టాయ్‌లెట్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్లకు సూచించారు.

వరదకు అడ్డుకట్ట



బియ్యపుతిప్ప వద్ద ఈస్ట్ కొక్కిలేరు స్లూయిస్

» స్లూయిస్, ఏటిగట్టు పనులకు నిధులు విడుదల » మంత్రి చొరవతో 14 ఏళ్ల సమస్యకు మోక్షం
» నదీ పరీవాహక గ్రామాలకు ఊరట » టెండర్ల ప్రక్రియకు అధికారులు సన్నద్ధం

నరసాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వరద భయానికి త్వరలో చెక్ పడనుంది. 14ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణ పనులకు, అసంపూర్తిగా మిగిలిన ఏటిగట్టు ఎత్తు పనులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సుమారు రూ. 16 కోట్ల అంచనాతో పంపిన పనులకు క్లియరెన్స్ ఇస్తూ జీవో జారీ చేసింది. దీంతో అధికారులకు ఈ పనులకు సంబంధించిన టెండర్లు ఆహ్వానించేందుకు సన్నద్ధమవుతున్నారు.

జిల్లాలో సిద్ధాంతం నుంచి నరసాపురం మండలం బియ్యపుతిప్ప వరకు సుమారు 45 కిలోమీటర్ల మేర ఏటిగట్టు విస్తరించింది. 2006లో గట్టు పటిష్టం చేసే పనులకు అప్పటి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసింది. దొడ్డిపట్ల, వాకలగరువు, అబ్బిరాజుపాలెం, లక్ష్మిపాలెం, యలమంచిలి, గంగడపాలెం తదితర ప్రాంతాల్లో గట్టు ఎత్తు పనులు పెండింగ్‌లో పడ్డాయి. వరదలు వస్తే ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చేది. పలుమార్లు వరదలతో భారీ నష్టాన్ని చూడా చవిచూశారు. తాత్కాలికంగా ఇసుక బస్తాలతో గట్టును ఎత్తు చేస్తున్నప్పటికీ వరద ప్రవాహానికి ఫలితం లేకుండా పోయింది. 2009 ఈ పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అనేకసార్లు ప్రతిపాదనలు పంపినా మోక్షం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వరద నివారణపై ప్రత్యేక దృష్టి సారించింది. నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామనాయుడు బాధ్యతలు చేపట్టగానే ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యను వివరించారు. అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి నిధుల మంజూరుకు కృషి చేశారు. ఫలితంగా ఈ పెండింగ్ పనులకు ప్రభుత్వం రూ.4.45కోట్లు విడుదల చేసింది.

స్లూయిస్‌లకు మోక్షం

నరసాపురం యలమంచిలి మండలాల్లోని అవుట్‌పాల్స్ స్లూయిస్‌లు శిథిలావస్థకు చేరాయి. గోదావరిలో వచ్చే పోటు పాట్లకు కూడా తలుపులు సక్రమంగా తెరుచుకోవడం లేదు. ఇక వరదొస్తే స్లూయిస్‌లు, డ్రైనేజీల గుండా నీరు పోటెత్తుతోంది. యలమంచిలి మండలంలోని కాజా, నరసాపురం మండలంలోని పాత నవరసపురం, ముస్కేపాలెం, ఈస్ట్‌కొక్కిలేరు, బియ్యపుతిప్ప స్లూయిస్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. అడపదడపా మరమ్మతులు చేయిస్తున్నా ఫలితం లేదు. స్లూయిస్‌లు కొత్తగా నిర్మించాలని అధికారులు 15 ఏళ్లుగా ప్రతిపాదనలు పంపు తున్నా ఫలితం లేకుండాపోయింది. మంత్రి రామానాయుడు చొరవతో స్లూయిస్‌లకు మోక్షం కలిగింది. వీటి మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.9.40కోట్లు విడుదల చేసింది. యలమంచిలి మండలంలోని మడుగుమాము ఇరిగేషన్ తూము మరమ్మతుకు కూడా పచ్చజెండా ఊపింది.

త్వరలో టెండర్లు

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేసిందని ఏటిగట్టు శాఖ ఏఈ సుబ్బారావు తెలిపారు. ఇరిగేషన్ అధికారులకు టెండర్ అంచనాలను పంపుతున్నాం. అనుమతి రాగానే టెండర్ నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు.



ద్వారకాతిరుమల సర్పంచ్‌పై వేటు

» 6 నెలలు సస్పెన్షన్
» నిధుల దుర్వినియోగం
» ఉప సర్పంచ్‌కు బాధ్యతలు
» 15 రోజుల్లో రికవరీ చేయాలి
» కలెక్టర్ ఆదేశాలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిన ద్వారకాతిరుమల సర్పంచ్ కుంటం స్వర్ణలతపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. పంచాయితీ రాజ్ చట్టం ప్రకారం ఆరు నెలల పాటు పదవి నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్ దుర్వినియోగం చేసిన రూ. 53,57,376 సొమ్మును 15 రోజులలో రికవరీ చేయాలని ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ ఉప సర్పంచ్ బి.సావిత్రి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించాలని కలెక్టర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఉప సర్పంచ్‌కు చెక్ పవర్‌తో పాటు కౌంటర్ సైన్ అధికారాన్ని ఈవోపీఆర్డీ సుబ్బరాయన్‌కు అప్పగించారు. ద్వారకాతిరుమల పంచాయతీలో రూ.2 కోట్లకు పైబడి జరిగిన అవినీతిపై కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావు, పూర్వపు ఎంపీడీవో ఎస్ ఆశీర్వాదంను సస్పెండ్ చేసిన అధికారులు తాజాగా సర్పంచ్ స్వర్ణలతపై చర్యలు చేపట్టారు. పంచాయితీ నిధులు రూ.53,57,376 దుర్వినియోగంపై సర్పంచ్ స్వర్ణలతను బాధ్యురాలిని చేస్తూ ఆమెను ఏపీపీఆర్ చట్టం, 1994లోని సెక్షన్ 249-బి(5) ప్రకారం ఎందుకు సస్పెండ్ చేయకూడదని జూలై 29న కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. దీనిపై ఆగస్టు 9న సర్పంచ్ స్వర్ణలత తాను పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదని, తనపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని కోరారు. సర్పంచ్ వివరణపై విచారణకు జంగారెడ్డిగూడెం డీఎల్పీవోకు కలెక్టర్ సెప్టెంబరు 17న కలెక్టర్ మెమో జారీ చేశారు. పంచాయితీ రికార్డులను తనిఖీ చేసిన డీఎల్‌పీవో నివేదికను అందజేశారు. పంచాయతీ రికార్డుల ప్రకారం సర్పంచ్‌పై ఆరోపణలు వాస్తవమేనని స్పష్టం చేశారు. డీఎల్పీవో నివేదిక మేరకు సర్పంచ్‌ను ఆరునెలల పాటు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు.



ఆసుపత్రి వైద్యులతో సమావేశమైన గుంటూరు మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ ఉషారాణి

ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక బృందం

» పీజీ వైద్య సీట్ల కేటాయింపుపై ప్రత్యేక వైద్య బృందం పరిశీలన
» ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఆరు పీజీ సీట్లకు ప్రతిపాదన

ఏలూరు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పోస్టు గ్రాడ్యుయేట్ సీట్ల కేటాయింపుపై ప్రత్యేక వైద్య బృందం బుధవారం పరిశీలించింది. పీజీ సీట్లు కేటాయించడానికి ఆసుపత్రిలో సౌకర్యాల పరిశీలనకు డీఎంఈ (డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) ఒక బృందాన్ని పంపించింది. గుంటూరు మెడికల్ కళాశాల జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ ఉషారాణి, విజయవాడ మెడికల్ కాలేజీ గైనకాలజీ విభాగం ప్రొఫెసర్ సౌజన్యతో కూడిన ప్రత్యేక బృందం ఆసుపత్రిని పరిశీలించారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇప్పటికే మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ పూర్తై రెండో సంవత్సరం జరుగుతుండగా రెండో సంవత్సరం కూడా ఎంబీబీఎస్ విద్యార్థులు చేరారు. ఈనేపథ్యంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న ప్రత్యేక విభాగాలకు ఒకొక్క విభాగానికి ఒక్కొక్క మెడికల్ పీజీ సీటు కేటాయించడానికి డీఎంఈ పరిశీలన చేస్తుంది. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఎనస్తీషియా, పిడియాట్రిక్స్, ఆర్థో, సర్జికల్ విభాగాల్లో ఒకొక్క విభాగానికి ఒకొక్క సీటును మంజూరు చేయడానికి పరిశీలనకు వచ్చారు. పీజీ కోర్సు విద్యకు ఇక్కడ మౌలిక సదుపాయాలు ఏవిధంగా ఉన్నాయి పరిశీలించారు. ఈ బృందం నివేదికను డీఎంఈకి సమర్పించనుంది. అనంతరం డీఎంఈ తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. బుధవారం జనరల్ మెడిసిన్, విభాగాలను పరిశీలించగా, గురువారం మరో రెండు విభాగాల పరిశీలిస్తారు. శుక్రవారం కూడా మరో రెండు విభాగాలకు వైద్య బృందాలు రానున్నాయి. ఉషారాణి, సౌజన్య ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్, జనరల్ మెడిసిన్ ప్రధాన వైద్య నిపుణులు సుధాకర్, పోతుమూడి శ్రీనివాసరావు, సికింద్ర మోహన్, హేమా చౌదరిలతో సమావేశమై చర్చించారు.



లంకలకోడేరు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో నాగమణి

పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి

» డీఈవో నాగమణి

పాలకొల్లు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కష్టపడాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ (కాకినాడ), డీఈవో జి.నాగమణి అన్నారు. లంకలకోడేరు జడ్పీ హైస్కూల్‌ను నాగమణి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవసరమైన సూచనలు, కార్యచరణ ప్రణాళికను వివరించారు. తరగతుల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పాఠశాల అటల్ ల్యాబ్‌ను పరిశీలించి విద్యార్థులు తయారు చేసిన రొబోటిక్, చంద్రయాన్ నమూనాలను పరిశీలించారు. జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాఠశాల జిల్లాలో ప్రథమ స్థానం సాధించడంపై అభినందించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ద్వారా తయారు చేసిన గుర్తింపు కార్డులను విద్యార్థినీ, విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాల ప్రగతిపై సమీక్షించారు. ఎంఈవోలు జి.వీరాస్వామి, ఆర్‌వీఎస్ గంగాధర శర్మ, ఎంఈవో కార్యాలయ సిబ్బంది టి.జనార్ధన్, హెచ్ఎం పి.భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'టెట్'కు 52 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన 'టెట్'కు 52 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 185 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 165 మంది, మధ్యాహ్నం పరీక్షకు 185 మందికి 153 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదుకా లేదన్నారు.



టెక్రియా 2 కే 24 ప్రారంభ కార్యక్రమంలో విద్యార్థుల సందడి

నేటి నుంచి ఏపీ నిట్‌లో టెక్రియా 2కే 24

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ నిట్‌లో ఈ నెల 17 నుంచి 19 వరకూ టెక్రియా 2కే24 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి తెలిపారు. నిట్ ప్రాంగణంలో బుధవారం రాత్రి రైజర్ కార్యక్రమాన్ని దినేష్ శంకర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో వైజ్ఞానిక స్పృహను పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, ఆచార్యులు తలారి రేష్మ, తదితరులు పాల్గొన్నారు

ఎన్టీఆర్ భరోసాకు విజయవాడ వెళ్లాల్సిందే

మెడికల్ సర్టిఫికెట్ కోసం దివ్యాంగుల పాట్లు

ఏలూరు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ దరఖాస్తులు ధ్రువీకరణ పత్రాలకోసం విజయవాడ వెళ్లాల్సి వస్తోందని దివ్యాంగులు వాపోతున్నారు. మెడికల్ బోర్డు సంతకాలతో మంగళవారం, గురువారం ధ్రువీకరణ జారీ చేసేవారు. గత ప్రభుత్వ హయాంలో మెడికల్ బోర్డు ద్వారా పొందిన సర్టిఫికెట్లతో డీఎంహెచ్‌వో కార్యాలయంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే చెల్లవని చెబుతున్నారు. తిరిగి మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించడంతో దివ్యాంగులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడ కొన్ని విభాగాల వైద్యులు లేరని, విజయవాడ వెళ్లాలని సూచించారు. దీనితో దివ్యాంగులు నిస్సహాయంగా మిగిలారు. పక్షవాతం, పోలియో, మానసిక వైకల్యం, నరాల సమస్య ఉన్న దివ్యాంగులకు మెడికల్ బోర్డు ధ్రువీకరించిన న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జన్, ఆర్థోపెడిక్స్ వైద్యులు మెడికల్ కాలేజీ లేదా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చెందినవారై ఉండాలి. ఈ నెల 7న డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈవిధంగా పేర్కొన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో న్యూరోఫిజీషియన్, న్యూరోసర్జన్ లేకపోవడంతో పక్షవాతం, పోలియో, మానసిక వైకల్యం, నరాల సమస్య ఉన్న దివ్యాంగులు ఎన్టీఆర్ భరోసా హెల్త్ పెన్షన్ మెడికల్ సర్టిఫికెట్ పొందడానికి విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని ఏలూరు ప్రభుత్వాసు పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సుధాకర్ నోటీసు బోర్డులో ఉంచారు. ఇకపై విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రికి వెళ్లి సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. గతంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సదరం సర్టిఫికెట్ల జారీకి సంబంధిత వైద్యులు లేకపోతే వారే ఆసుపత్రిలో వారానికి రెండు సార్లు స్పెషల్ డ్యూటీ వేసి సర్టిఫికెట్లు జారీ చేసేవారు. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ మెడికల్ సర్టిఫికెట్ జారీకి సంబంధిత వైద్యులను వారానికి ఒకరోజు ఏలూరు ఆసుపత్రికి పంపించాలని దివ్యాంగులు కోరుతున్నారు.

ఈ నగరానికి ఏమైంది!



» ఏలూరులో అల్లరి గ్యాంగ్‌లు
» అదుపు తప్పిన శాంతిభద్రతలు
» అర్ధరాత్రులూ సంచరిస్తున్న నేరస్తులు
» కొందరు పోలీసులకు మామూళ్ల మత్తు
» పోలీసు నిఘా వైఫల్యం

ఏలూరు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో అల్లరి గ్యాంగులు పెట్రేగిపోతున్నాయి. నగర ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎన్నికల వరకూ వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య రాజకీయ విభేదాలు కొద్దిరోజుల పాటు ఘర్షణలకు దారి తీశాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో అధికారుల బదిలీలు జరగడం, అప్పటి వరకూ పనిచేసిన అధికారులు బదిలీ అవుతామని విధులను సరిగా పట్టించుకోకపోవడంతో ఏలూరు నగరంలో అల్లరి మూకల జోరు పెరిగింది. అల్లరి మూకలు నిత్యం గొడవలకు, ఘర్షణలకు పాల్పడుతూనే ఉన్నారు. ఒకనాడు ఏలూరు నగరంలో రాత్రి పది గంటల తరువాత రోడ్డుపై ఎవరు కనిపించినా బీట్ పోలీసులు విజిల్‌వేసి మరీ వెళ్ళిపోమనేవారు. షాపులను కూడా మూయించే వారు. ఏలూరు పట్టణం నగరంగా మారడం, భోజన హోటళ్లకు 11 గంటల వరకు అనుమతి నేపథ్యంలో నగరంలో జన సంచారం రాత్రి వేళ కూడా పెరిగింది. రాత్రి వేళ రెండో ఆట సినిమా తరువాత ఎవరైనా కనిపిస్తే బీట్ పోలీసులు ప్రశ్నించే వారు. సినిమాకు వెళ్లి వస్తే టిక్కెట్ చూపించమనేవారు. లేదంటే పోలీసుల వద్ద ఉన్న ట్యాబ్‌లో వారి వేలిముద్రలను పరిశీలించి చేసి నేరస్తులో కాదో తెలుసుకునే వారు. వారి వివరాలు తీసుకునేవారు. ఈ విధానం కూడా క్రమేపీ ఆగిపోయింది.

తెల్లవార్లూ అల్లరి మూకలు

ప్రస్తుతం నగరంలో తెల్లవార్లు అల్లరి మూకలు తిరుగుతూనే ఉన్నాయి. వారికి కావాల్సిన ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. కొన్ని బార్లు బార్లా తెరచి ఉండడం, కొన్ని బిర్యానీ పాయింట్లు, టిఫిన్ సెంటర్లు వ్యాపార కార్యకలాపాలు కొనసాగించడంతో ఏ సెంటర్‌లో చూసినా పగలు రాత్రి తేడా తెలియకుండా అల్లరి మూకల సంచారం పెరిగింది.

పెరిగిన నేరాలు

ఇటీవల నేరాలు కూడా పెరిగిపోయాయి. కొద్ది రోజుల నుంచి ఏలూరు నగర సంఘటనలను పరిశీలిస్తే తంగెళ్ళమూడి ప్రాంతంలో హత్యాయత్నం, పాతబస్టాండ్ వద్ద గంజాయి బ్యాచ్‌ల గొడవలు, అశోక్‌నగర్‌లో ఒక ఇంటిపై దాడి, ప్రభుత్వాసుపత్రి, ఆర్‌ఆర్‌పేటలో మోటారు సైకిళ్ల చోరీలు, వంగాయిగూడెం సెంటర్, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో గొడవలు, కొన్ని కార్పొరేట్ కాలేజీల వద్ద గంజాయి విక్రయాలు, కొన్ని కాలేజీల విద్యార్థులే గ్రూపులుగా మారి రైలు పట్టాలపైనే దాడులకు తెగబడిన సంఘటనలు, అర్ధరాత్రి వేళ రౌడీషీటర్లు, పాతనేరస్తులు యథేచ్ఛగా సంచారం. ఏలూరు శివార్లలో గంజాయి విక్రయాలు నిత్యకృత్యమయ్యాయి. ఆసుపత్రికి నిత్యం ఇలాంటి గొడవలు పడ్డవారు చేరుతూనే ఉన్నారు. ఎమ్మెల్సీలు ఎన్ని వచ్చినా కేసుల నమోదు చేసి కేవలం పది శాతం మాత్రమే అని తెలుస్తోంది. కొన్ని పోలీస్ స్టేషన్లు అయితే రైటర్స్ చక్రం తిప్పుతున్నారు. ఏ గొడవలు వచ్చినా వారే సెటిల్‌మెంట్ చేస్తూ కేసులు నమోదు చేయకుండా నేరస్తులకు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గొడవలు, ఘర్షణలకు సంబంధించి అల్లరి మూకల దాడికి గురైన వారు వివిధ ఆసుపత్రులలో చేరగా అక్కడ నుంచి వచ్చిన ఎమ్మెల్సీలపై పోలీసులు ఎన్ని కేసులు నమోదు చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కొత్త గ్యాంగ్‌లు

నగరంలో నేరస్తులు, గంజాయి కేసులో ఉన్న నిందితులపై నిఘా వైఫల్యంతో వారు యథేచ్ఛగా అర్ధరాత్రి వేళ కూడా సంచరిస్తున్నారని స్పష్టమవుతుంది. నగరంలో కొత్త గ్యాంగ్‌లు పుట్టుకొస్తున్నాయి. తమకు తిరుగే లేదంటూ హల్‌చల్ చేస్తున్నారు. నగరంలో రాత్రి వేళ పది గంటల తరువాత వ్యాపారాలు గతంలో మూయించే వారు. కానీ ప్రస్తుతం బీట్ పోలీసులు కొంత మంది వ్యాపారుల నుంచి మామూళ్లు వసూలు చేస్తూ చూసీ చూడనట్లు వదిలివేస్తున్నారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. తెల్లవార్లు వ్యాపారాలు కొనసాగుతూ ఉండడంతో నేరస్తులకు, అల్లరి గ్యాంగులకు అవి అడ్డాగా మారాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టక పోతే నగర శాంతిభద్రతలకు ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

క్రైమ్ కార్నర్



మృతి చెందిన కొత్స సీతారత్నం

కాలువలోపడి వృద్ధురాలి మృతి

భీమడోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పూళ్ళ కమ్మరకుంట వీధికి చెందిన వృద్ధురాలు కొత్స సీతారత్నం (65) కాలువలో పడి మృతి చెందింది. ఈనెల 14న రాత్రి భోజనం చేసి పడుకున్న తరువాత తెల్లవారుజామున ఇంట్లో ఆమె కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు పూళ్ళ గ్రామాల్లోని సీసీ కెమెరాల పుటేజిని పరిశీలించగా ఏలూరు గోదావరి కాలువలో పడడాన్ని గమనించారు. అగ్నిమాపక అధికారులు, పోలీసులు ఏలూరు కాలువలో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని కనుగొన్నారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.



గణేశ్ మృతదేహం

ట్రాక్టర్ పైనుంచి పడి ఒకరి మృతి

కొయ్యలగూడెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌పై నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. బయ్యన్నగూడెం శివారులో బుధవారం వెళుతున్న ట్రాక్టర్ పైనుంచి కొల్లు మోషేయ్(30) కిందపడిపోయాడు. అతడి తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రామానుజపురం గ్రామానికి చెందిన మోషేకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాణసంచా దుకాణంపై పోలీసుల దాడి

తణుకు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తణుకు మండలం దువ్వ జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఒక ఇంటిలో బాణసంచా దుకాణంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఉండ్రాజవరం మండలం కెసావరం గ్రామానికి సుధాకర్, అన్నవరం కలిసి షాపు అద్దెకు తీసుకున్నారు. అనుమతి లేకుండా దీపావళి సామాన్లు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారంపై ఎస్‌ఐ ఏజీవీ మూర్తి, సిబ్బంది దాడులు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని రెండు లక్షల విలువగల సామాన్లు సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వినాయకుడి వెండి కిరీటం చోరీ

తణుకు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తణుకు మండలం వేల్పూరు విష్వేశ్వర ఆలయంలో వినాయకుడి కిరీటాన్ని అపహరించారు. విగ్రహానికి అమర్చిఉన్న 500 గ్రాములు కిరీటాన్ని దొంగలు అపహరించారని స్థానికుడు గుణ్ణం హరి వెంకట రాజారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ ఏజీ మూర్తి తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం

తణుకు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండపాక గ్రామంలోని కాలువలో ఈనెల 15న ఒక మృతదేహం కొట్టుకువచ్చింది. మృతుడి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ మూర్తి బుధవారం తెలిపారు. ఇరగవరం మండలం గోటేరు గ్రామానికి చెందిన చంద్రవరపు రాజేష్ (34)గా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

పోలవరం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.5లక్షలు మోసం చేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ పవన్ కుమార్ బుధవారం వివరాలు తెలిపారు. ఎల్ఎన్‌డీ పేట గ్రామానికి చెందిన చింతల చెరువు సుందర భాస్కర్ వద్ద ఉంగుటూరు మండలం కాకిపాడు గ్రామానికి చెందిన బొట్ల పెద్దిరాజు ప్రభుత్వ పాఠశాలలో యోగా టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 2022లో రూ.2.5 లక్షలు తీసుకున్నాడు.



ఫోన్లను అందజేస్తున్న ఎస్‌ఐ రమణ

పోగొట్టుకొన్న ఫోన్ల అందజేత

భీమవరం క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భీమవరం రైల్వేస్టేషన్ (జీఆర్‌పి) పరిధిలో పోగొట్టుకున్న మొబైల్స్ ఫిర్యాదుదారులకు బుధవారం అందజేశారు. జీఆర్పీ ఎస్‌ఐ రమణ మాట్లాడుతూ రైల్వేస్టేషన్లు, రైళ్లలో మొబైల్స్ పోగొట్టుకుని జీఆర్పీలో ఫిర్యాదు చేయగా రికవరీ చేశామన్నారు. సుమారు రూ.లక్ష విలువచేసే ఐదు మొబైల్స్‌ను తిరిగిఅందజేశామన్నారు.

ఇన్‌చార్జ్ మంత్రిగా నాదెండ్ల నియామకంపై హర్షం



మంత్రి నాదెండ్లకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న రెడ్డిఅప్పలనాయుడు

ఏలూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఇన్‌చార్జ్ మంత్రిగా నాదెండ్ల మనోహర్‌ను నియమించడంపై జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

రజక చెరువుల సమస్య పై డీపీవో స్పందన

ఏలూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో వృత్తిచెరువులు కేటాయించి ఆ చెరువులో చేపల ఫలసాయం వారికే చెందేలా, రజకులకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను అమలు చేయాలని కోరుతూ ఇటీవల జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఆ సమస్యలపై ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీపీవో ఎం.సుందరి స్పందించటంతో కట్లయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తీసుకున్న నిర్ణయాలను సర్క్యులర్ రూపంలో కట్లయ్యకు డీపీవో అందచేశారు. రజక చెరువులు కేటాయించటంతో పాటు ప్రతి సమస్యను పరిష్కరిస్తామని డీపీవో హామీ ఇచ్చారని కట్లయ్య తెలిపారు.

8 నుంచి ప్రజా హోరు

పెదపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అధిక ధరలు, నిరుద్యోగం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నవంబరు 8 నుంచి 15వ తేదీ వరకు సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాహోరు కార్యక్రమం జరుగు తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఆర్.లింగరాజు తెలిపారు. పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో సీపీఎం పెదపాడు శాఖా మహాసభ సమావేశం బుధవారం జరిగింది. ప్రజా సమస్యలపై పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాలలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని సీపీఎం నాయకులు జి.నరసింహారావు డిమాండ్ చేశారు. పడమరవీధి శాఖ మహాసభ చేపల చెట్టు సెంటర్‌లో అప్పారావు గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్, డి.దుర్యోధన, ఎం.శ్రీనివాస్, సీహెచ్.అన్నవరం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని మంత్రి లోకేశ్‌కు వినతి



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రాన్ని అందచేస్తున్న దృశ్యం

కామవరపుకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వ హయాంలో నాయక్ కులస్తులకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇచ్చేవారి, వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని తొలగించారని మళ్లీ ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని మాజీ జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఘంటా సుధీర్‌బాబు, నాయక్ కులస్తులు మంత్రి నారా లోకేశ్ విన్నవించారు. ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. తగు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. నాయక్ కుల పెద్దలు ఎన్.సత్యనారాయణ, జి.మురళీ, రాధాకృష్ణ, బి.ఏసు, ఎ.రాంబాబు, తదితరులు ఉన్నారు.

భూ రీసర్వేపై గ్రామసభలు

దెందులూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : భూ రీసర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నమని ఏలూరు ఆర్డీవో డాక్టర్ అచ్యుత్ అంబరీస్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుమతి ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 18న మేదినరావుపాలెం, 19న తిమ్మనగూడెం, 22న కంద్రిగనర సింహపురం 23న శ్రీరామవరం 24న గుడికుంట, 25న అక్కిరెడ్డిగూడెం, 26న సానిగూడెం, 29న గాలాయగూడెం, 30న కొత్తపల్లి, నవం బరు ఒకటో తేదీన చల్లపల్లి, 2న ఉప్పుగూ డెం, 5న కొమిరేపల్లిలో గ్రామసభలు నిర్వహిసున్నామన్నారు.

● ఉంగుటూరు : మండలంలో భూ రీసర్వేకు గ్రామసభలు ఈ నెల 18న వెల్లమిల్లి, 19న బొమ్మిడి, 22న కాగుపాడు, 23న రావులఎర్రు, 24న రాచూరు, 25న దొంతవరంలో నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదరావు తెలిపారు.

● జంగారెడ్డిగూడెం : మండలంలో భూ రీసర్వేలు ఈ నెల 18న పట్టెన్నపాలెం, 19న అక్కంపేట, 22న శ్రీనివాసపురం, 23న పుల్లేపూడి, 24న మైసన్నగూడెం, 25న పెద్దిపల్లి, 26న చక్రదేవరపల్లి, 29న రామచర్లగూడెం, 30న తిరుమలాపురం, నవంబరు ఒకటిన పంగిడిగూడెం, 2న లక్కవరం, 5న దేవులపల్లి, 6న అమ్మపాలెం, 7న నిమ్మలగూడెం గ్రామల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని తహసీల్దారు కె.స్లీవ జోజి తెలిపారు.

● లింగపాలెం : మల్లేశ్వరం, పోచవరం, చంద్రన్నపాలెం, మఠంగూడెం, లింగపాలెంల లో భూ రీసర్వే నిర్వహిస్తున్నామని తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు.

ఇలా వదిలేసారేంది సారూ..

» మరమ్మతులకు నోచుకోని చేతిపంపులు » తాగునీటికి అవస్థలు పడుతున్న ప్రజలు



మరమ్మతులు చేయకుండా వదిలేసిన చేతిపంపు

వేలేరుపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మరమ్మతులకు గురైన చేతి పంపులను పట్టించుకునే నాధుడు లేకపోవడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతి పంపులు మరమ్మతులు చేసే మెకానిక్‌ను ఈ మండలానికి కేటాయించక పోవడంతో ఒక కారణం కాగా మరమ్మతులకు అవసరమైన పరికరాలను అధికారులు తమకూర్చడంలో చూపిస్తున్న నిర్లక్ష్యం కారణంగా చేతిపంపులు పని చేయకుండా పోతున్నాయి. స్థానికంగా ఉన్న చేతి పంపుల మేకానిక్‌లు ఏర్పాటు చేసుకుని మరమ్మతులు చేయించాలని సర్పంచ్‌లు ప్రయత్నాలు చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సహకరించడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలేరుపాడు మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న ఒక చేతిపంపు కొన్ని నెలలుగా పని చేయడంలేదు. స్థానికులు ఎన్నోసార్లు ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లిన కనీసం స్పందించలేదు. సర్పంచ్ చోడే వెంకమ్మ చొరవ తీసుకుని ప్రయివేటు మెకానిక్ ద్వారా ఈ చేతిపంపును మరమ్మతులు చేయించేందుకు ప్రయత్నం చేశారు. ఈ చేతిపంపు తుప్పుపట్టి రంధ్రాలు పడిపోవడంతో నీరు పైకి వచ్చే అవకాశం లేకపోయింది. ఈ విషయాన్ని ఎంపీడీవోకు తెలిపి పైపులు సమకూర్చాల్సినదిగా కోరి నెల రోజులైన కనీసం స్పందించలేదని సర్పంచ్ ఆరోపిస్తున్నారు. పాత ఇనుము అమ్మేక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పనికి వచ్చే చేతిపంపు సామగ్రిని కూడా తక్కు ఇనుము కింద సుమారు నాలుగు క్వింటాళ్ల సామగ్రిని ఇటీవలే ఒక వ్యాపారికి నిబంధనలకు వ్యతిరేకంగా అమ్మివేసినట్లు సమాచారం. ప్రస్తుతం మండల వ్యాప్తంగా అనేక చేతిపంపులు, సామగ్రి కొరత కారణంగా పని చేసే వీలు లేకుండా పోయింది. ఇప్పటికైన అధికారులు స్పందించి చేతిపంపులు పని చేసేలా మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం





అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న నిడమర్రు మండలం అడవికొలనులో ఎమ్మెల్యే ధర్మరాజు, లింగపాలెం మండలంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్

నిడమర్రు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పాలన ఉంటుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలో పలుగ్రామాల్లో బుధవారం పల్లె పండుగలో భాగంగా రూ.2.72 కోట్లతో ఎనిమిది సీసీ రోడ్ల పనుల శంకుస్థాపనలు చేశారు. మండల కన్వీనర్ ఎన్.దొరబాబు, సర్పంచ్ పి.వెంకటేశ్వరరావు, టీడీపీ అధ్యక్షుడు ఎం.స్వామి, పి.రాంమూర్తి, తదితరులున్నారు

● లింగపాలెం : గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సంక్రాతి నాటికి పనులు పూర్తయ్యేలా చూస్తామని అన్నారు. వేములపల్లిలో సచివాలయాన్ని, రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. జి.చలపతిరావు, జీ ఎస్ఎస్‌వీ ప్రసాద్, ఎం.రాము, దివ్యదీప్తి, కె. వెంకటేశ్వరరావు, జి.బుజ్జయ్య, ఆర్.చక్రధర రావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● పెదపాడు : కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పెదపాడు ఎన్టీఆర్ కాలనీలో రూ.50 లక్షలు, తోటగూడెంలో రూ.11.40 లక్షలు, వసంతవాడలో రూ.18 లక్షలతో సీసీ రహదారి, సీసీ డ్రెయిన్లు, రూ.2.30 లక్షలతో గోకులం షెడ్డు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే ప్రభాకర్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ రూ.4,500 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, గోకులం షెడ్లు నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం అప్పనవీడు జాతీయరహదారి పక్కన వి.శ్రీనివాస రావు ఆధ్వర్యంలో అయ్యప్ప, భవానీ దీక్షా దారులకు ఏర్పాటు చేసిన బిక్షా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతమనేని బుధవారం ప్రారంభించారు. జి.వెంకటలక్ష్మి, బి.కాశీబాబు, యు.రాంప్రసాద్, సర్పంచ్‌లు ఎ.అబ్రహం, కె.జీవనకుమారి, అధికారులు, అయ్యప్ప. భవానీలు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : మండలంలో మొదటి విడతగా 12 పంచాయతీల్లో రూ.మూడు కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కామయ్యకుంట, కేఆర్ పురం, కోయరాజమండ్రి, బుట్టాయగూడెం, లక్ష్ముడుగూడెం పంచాయతీల్లో నిర్మించే సీసీ రోడ్ల పనులకు ఆయన భూమిపూజ చేశారు. డిసెంబరు నాటికి రోడ్ల పనులను పూర్తిచేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లతోపాటు లింకు రోడ్లు, గ్రావెల్, మెటల్, ప్రధాన ప్రాంతాలను కలుపుతూ బీటీ రోడ్లను వేస్తామన్నారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు గిరిజన సాంప్రదాయాలతో ఘన స్వాగతం పలికారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, కరాటం వెంకటరెడ్డి నాయుడు, కరాటం సాయిబాబా, గెడ్డమణుగు రవికుమార్, ఎంపీడీవో కె.జ్యోతి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లు

ఏలూరు టూ టౌన్, అక్టోబరు 16: కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండుకళ్లని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఎమ్మెల్యే చంటి ఆదేశించారు. సీహెచ్.వెంకటరత్నం, సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాదరావు, ఎం.పార్థసారథి, బి.కిషోర్, ఎన్.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఏలూరు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దుకాణాల ముందు ఉన్న రోడ్డు కనిపించేలా సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని ఏలూరు వన్ టౌన్ సీఐ జి.సత్యనారాయణ వ్యాపారులకు సూచించారు. ఏలూరు వన్‌టౌన్‌లోని మెయిన్ బజార్, కుండీ సెంటర్, అజంతా సెంటర్, తదితర ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో విజిబుల్ పోలీసింగ్‌ను బుధవారం రాత్రి నిర్వహించారు. ట్రాఫిక్‌నకు అంతరాయం కలుగకుండా పార్కు చేయాలని దుకాణాల ముందు రోడ్లను ఆక్రమించవద్దని సూచించారు.

మొక్కలు నాటి సంరక్షించండి

దెందులూరు, అక్టోబరు 16 : అంగన్వాడీ కేంద్రాల అవరణలలో మొక్కలు నాటి సంరక్షించాలని దెందులూరు మండల సెక్టార్ అంగన్వాడీ సూపర్ వైజర్ చిట్టెమ్మ పేర్కొన్నారు. చల్లంతలపూడి గౌడవీధి, కొత్తకమ్మవారిగూడెం యాదవులపేట అంగన్వాడీ కేంద్రాల్లో టీడీపీ నాయకులతో కలిసి అంగన్వాడీ ఉపాధ్యాయులు మొక్కలను నాటారు.

చంద్రబాబుతో ఎమ్మెల్యే చంటి బేటీ



ఏలూరు టూ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజ కవర్గ అభివృద్ధిలో భాగంగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) సీఎం చంద్ర బాబుతో సమావేశమయ్యారు. అమరావతి సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రితో సహా పలువురు మంత్రులను ఎమ్మెల్యే చంటి కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. అనంతరం మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, హోంమంత్రి అనీతను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కావల్సిన నిధులపై చర్చించారు. నిధులు కేటాయించటానికి సీఎంతో సహా మంత్రులు కూడా ఎమ్మెల్యే చంటికి హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది.

22న జాబ్ మేళా

ఏలూరు అర్బన్/భీమడోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ,డీఎల్‌టీసీలో, భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌చార్జి అధికారి వి.కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో సుమారు 180 ఉద్యోగావకాశాలు న్నాయని వివరించారు. టెన్త్ నుంచి పీజీ వరకు విద్యార్హతలు గల నిరుద్యోగ యువత పాల్గొనవచ్చన్నారు.

మగ్గం, జర్దోసిలో శిక్షణ

భీమడోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సహకారంతో భీమడోలులో మగ్గం, జర్దోసిలో ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామ దేవతల ఆలయాల వద్ద ఈ శిక్షణ ఉంటుందని, ఉత్సాహవంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని సంస్థ సూచించింది.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్లు అందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు సూచించారు. స్థానిక సూర్య కళాశాలలో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రాన్ని నాయకులు బుధవారం ప్రారంభించారు. ఓటరు నమోదుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్ లైన్, ఆఫ్ లైన్‌లో కూడా ఓటు నమోదు చేసుకునేలా హెల్ప్ డెస్క్ పని చేస్తుందన్నారు. పట్టణ అధ్యక్షుడు ఆర్.కృష్ణ,షేక్ ముస్తఫా, ఎన్.రామచంద్రరాజు, కె.కిషోర్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

టి.నరసాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎంపీ డీవో ఎస్.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌ని బుధవారం సందర్శించిన ఆయన మధ్యాహ్నం భోజన పథకాన్ని విద్యార్థులకు స్వయంగా వడ్డించి నాణ్యత పరిశీలించారు. అనంతరం 10వ తర గతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. హైస్కూల్ హెచ్ఎం బి.లింగ స్వామి, ఉపాధ్యాయ సిబ్బంది ఆర్‌వీజీ కృష్ణా రావు, కె.కుటుంబరావు ఉన్నారు.

కేన్సర్ బాధితుడికి సాయం

టి.నరసాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) కష్టంలో ఉన్న టి.నరసాపురానికి చెందిన ఎయిమ్ నాయకుడు దూబా విల్సన్‌కు ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ అండగా నిలిచారు. గ్రామానికి చెందిన విల్సన్ ఇటీవల కేన్సర్‌తో అనారోగ్యానికి గురయ్యారు. వైద్యం చేయించుకోనే స్తోమత లేదని ఎయిమ్ అధ్యక్షుడు సునీల్‌కుమార్ దృష్టికి ఏలూరు జిల్లా ఎయిమ్ అధ్యక్షుడు వి.ఆనంద్ తీసుకువెళ్లటంతో వెంటనే సునీల్ కుమార్ హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ హాస్పిటల్లో విల్సన్‌ను జాయిన్ చేయించారు. అంతేకాక అతని వైద్యానికయ్యే మొత్తం ఖర్చు ఆయనే చూసుకుంటున్నారని ఆనంద్ తెలిపారు. సునీల్‌కుమార్‌కు ఎయిమ్ ధన్యవాదాలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పటిష్టపర్చాలి

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18వ తేదీన జరగబోయే ఇఫ్టూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక ఇఫ్టూ కార్యాలయం వద్ద, తంగెళ్లమూడిలోని ఏరియా ఇఫ్టూ స్థూపం వద్ద ప్రచార పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ అనుబంధ ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి ఎన్.నెహ్రుబాబు మాట్లాడుతూ ఉచిత ఇసుక పథకం అమలుకాక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు వర్మ, ఎం.భాస్కర్, కుమార్, నాగూర్, సత్తిబాబు, నారాయణ, సిద్ధియ్య, మహేష్, బాక్సర్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ డీఎస్సీలో ప్రతిభ

జీలుగుమిల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ఇటీవల తెలంగాణ 2024 డీఎస్సీల్లో జీలుగుమిల్లికి చెందిన పసుపులేటి సాయిచందు టీచర్ పోస్టు దక్కించుకున్నాడు. టీఎస్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ 9వ ర్యాంకు సాధించాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో ఎస్‌జీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా నియమాక పత్రం అందింది.

అక్షరాస్యతతోనే సామాజికాభివృద్ధి

పెదవేగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ అక్షరాస్యతతోనే సామాజికంగా ఎదుగుదల ఉం టుందని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం టీఏ ద్వర్గు అన్నారు. నిర్దిష్ట అభ్యాసన వైకల్యాలు (డిజెక్సియా)పై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ప్రభుత్వం చేపట్టిన మాసోత్సవాల్లో భాగం గా పెదవేగి, కొప్పాక గ్రామాల్లో పాఠశాలలు, భవిత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఎంలు, పీఈటీ, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ఏలూరు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలని సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని వాటి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాల ని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సు బ్బారావు అన్నారు. ఏలూరు ఆదిత్య కాలే జీ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన, మహిళలకు ఉన్న రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యం లో బుధవారం నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ కాంతిప్రియ, సైబర్ క్రైమ్ ఎస్ఐ మధు వెంకటరాజా, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

వెంకటరెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాతరాజానగరం సమీపంలో జరిగిన కారు ప్రమాదంలో మరణించిన రెడ్డిగూడెంకు చెందిన కొండరెడ్డి గిరిజనుడు కొవల వెంకటరెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రెడ్డిగూ డెంలో బుధవారం పర్యటించి ప్రమాదానికి గల కారణాలను వెంకటరెడ్డి భార్య అమ్మాజిని అడిగి తెలుసుకున్నారు. భర్తను కోల్పోయిన అమ్మాజికి ప్రభుత్వం ఉద్యోగం, నష్టపరిహారం ఇవ్వాలని, పిల్లలను ఆదుకోవాలన్నారు. ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, ఆదివాసీ ఐక్యకా ర్యచరణ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, కేవీపీ ఎస్ జిల్లా నాయకుడు ఎ.ఫ్రాన్సిస్, ఎం.చింతారా వు, గ్రామస్తులు పాల్గొన్నారు.

20న గంగానమ్మ సంబరాలు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగేశ్వరపురం చెరువుగట్టు వద్ద గల గణేష్ కార్తికేయ గంగానమ్మ, ముత్యాలమ్మ ఆలయం వద్ద ఈ నెల 20న సంబరాలు, తెప్పో త్సవం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ ఎన్.శ్రీనివాస రావు తెలిపారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు ప్రారంభిస్తారని చెప్పారు.

అంత్యక్రియలకు..

పెదపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని ఇందిరాకాలనీకి చెందిన కె.వీరయ్య భార్య కుమారి కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆర్థిక ఇబ్బందుల్లో వుండటంతో కుమారి అంత్య క్రియల కోసం వీరయ్య కుటుంబానికి మండల మానవత సంస్థ రూ. 4 వేలు అందజేసింది.

అన్నదాతలు అధిక దిగుబడులు సాధించాలి



పెదవేగిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

కొయ్యలగూడెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసా య శాఖాధికారులు ఇచ్చే సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ శాఖాధికారి చెన్నకేశవులు సూచిం చారు. సీతంపేట, యర్రంపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాటాడు తూ ప్రస్తుతం వరి పంటపై కంకినల్లి ఉన్నట్లు గుర్తించామని దీని నివారణకు డైకోఫాల్ అనే మందు 5ఎంఎల్ లీటరువాటరు లో కలిపి పిచికారి చేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారి దీరజ్, డీఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

● పోలవరం : జిల్లెల్లగూడెంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి సమస్యలకు అక్కడే పరిష్కార మార్గాలు సూచించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలోరైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఏవో కె.రాంబాబు రైతులు అధికారులు పాల్గొన్నారు.

● దెందులూరు : గోపన్నపాలెం గ్రామ పరిధిలో వరి పంట పొలాలను వ్యవసాయ అధికారుల బృందం పరిశీలించింది. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ మబీబ్‌భాషా, వ్యవసాయ శాఖ ఎడీ సుబ్బరావు, వ్యవసాయశాఖ అధికారి డి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు

● ఉంగుటూరు చేబ్రోలు, నారాయణపురం, నీలాద్రిపురంలో ఏవో డాక్టర్ ఎస్ఎస్ ప్రవీణ్ కుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. సర్పంచులు సీహెచ్. రాజేంద్ర, డి.అలకనంద, మాజీ ఎంపీపీ జి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ బి.నాగరాజు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

● టి.నరసాపురం : వెలగపాడు, అల్లంచెర్ల, రాజుపాలెం గ్రామంలలో వ్యవసాయశాఖ ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఏవో బి.సుమలత వివరించారు. సాగులో రైతులకు పలు సూచనలు అందించారు. టీడీపీ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఎన్.వెంకట్రావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.5 లక్షల విరాళం



ఏలూరు రూరల్, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం వాకర్స్ ఇం టర్నేషనల్ తరపున వాకర్స్ డోనర్స్ సేకరించిన రూ.5 లక్షల విరాళ చెక్కును బుధవారం సీఎం చంద్రబాబుకు సీఎం రిలీఫ్‌ఫండ్‌కు అందచే శారు. నడకకు సంబంధించి ప్రభుత్వ పాఠశా లలు, కళాశాలల్లో ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు అనుమతి మంజూరు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని సీఎంను కోరారు. సీఎంను కలిసిన వారిలో ఎ.సీతారామరాజు స్టేడియం వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

సర్క్యూట్ డిజైనింగ్‌పై ముగిసిన వర్కుషాపు



శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సర్క్యూట్ డిజైనింగ్‌పై స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఫిజిక్స్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వర్కు షాపు బుధవారం ముగిసింది. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులో ఇచ్చింగ్, సర్క్యూట్ల కనెక్టివిటీపై నైపుణ్యాలను, పీసీపీ విజార్డ్ 1.5ని ఉపయోగించి విద్యుత్ సరఫరా, సర్క్యూట్ల రూపకల్పన, వైట్‌క్లాంప్ డ్రిల్లింగ్‌పై విద్యార్థినులకు మైక్రోలింక్ టెక్నాలజీస్ సంస్థ సౌజన్యంతో శిక్షణ నిచ్చినట్టు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ నిర్మలజ్యోత్స్న తెలిపారు. భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలకు అవసరమైన సర్క్యూట్లను రూపొందించడంలో ఈ శిక్షణ విద్యార్థినులకు ఉపకరిస్తుందన్నారు. రిసోర్స్ పర్సన్లుగా సాంబశివరావు, గోవిందరావు వ్యవహరించారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. వర్కుషాపులో పాల్గొని స్వయంగా సర్క్యూట్ బోర్డులను రూపొందించిన విద్యార్థినులకు పతకాలు అందజేశారు.

ఫ్యామిలీ డాక్టర్

పెదవేగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో మారుమూల గ్రామాల్లో సైతం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మాధవి అన్నారు. కూచింపూడిలో హెల్త్ సెంటర్‌లో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బీపీ, మధుమేహం, సాధారణ వ్యాధులతోపాటు గర్భవతులు, మహిళలకు సంబంధించిన వ్యాధుల కు వైద్య పరీక్షలు నిర్వహించి, సూచనలు, సలహాలు అందించారు.

ఉచిత రక్త పరీక్షలు

పెదపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య భారత్ కోసం అనే నినాదంతో రిజ్విన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా రక్తపరీక్షలు (లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్), బీపీ, ఈసీజీ వంటి పరీక్షలు ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించడం జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత పరీక్షలు పెదపాడు విశాల సహకార బ్యాంకు (సొసైటీ) ఆవరణలో జరుగుతాయని, పెదపాడు, పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం

పోలవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమకి చెందిన కేఎస్ చక్రధర్, కె.తాతారావు రోడ్డు ప్రమాదంలో గాయపడి రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న మానవత సభ్యులు బుధ వారం వారిరువురికి రూ.5 వేల చొప్పున అందజేశారు. అధ్యక్షుడు పి. పోశిబాబు, ఎ.నరసింహ మూర్తి పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా సిబ్బందితో కలపర్రు టోల్‌ప్లాజా వద్ద ఐషర్ ట్రక్కులో సుమారు 15వేల కిలోల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు.

నేడు పల్లె పండుగ

చింతలపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొంటారు. పది పంచాయతీల్లో జరిగే సీసీ రోడ్ల శంకుస్థాపన, శివపురం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ, పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని మండల పరిషత్ అధికారులు వెల్లడించారు.

హెల్మెట్ ధరించాల్సిందే



చింతలపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ తప్పనిసరిగా ధరించాల్సిందేనని ఎస్ఐ కుటుంబరావు సూచించారు. నగర పంచాయతీలోని పాతబస్టాండ్, కోర్టు సెంటర్ వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. హెల్మెట్ తలకు రక్షణ కవచంగా ఉంటుందన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ లక్ష్మి

హాస్టళ్ల తనిఖీ

కలిదిండి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో బీసీ బాలికల హాస్టల్, ఎస్సీ బాలుర హాస్టల్, కోరుకొల్లులో ఎస్సీ బాలికల హాస్టల్‌ను మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వీవీఎన్‌వీ లక్ష్మి తనిఖీ చేశారు. భోజనం, వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టాయ్‌లెట్స్ పరిశు భ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్లకు సూచించారు. ప్యానల్ అడ్వకేట్ పి.పవన్ కాంత్, డి.శివప్రసాద్, పి.ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.



మిద్దె తోట

మేడపైనే కూరల సాగు

ఏది తిందామన్నా కల్తీ అయిపోయింది.. కూరగాయలు, పండ్లు , ఆకుకూరలు ఇలా అన్నీ రసాయన మందులతో కలుషితం అయి పోతున్నాయి. వాటిని తినడం వల్ల ఆరోగ్యం కూడా పాడవుతోంది.. వీటికి చెక్ పెట్టేందుకు ప్రకృతి సిద్ధంగా ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా తమ ఇంటిపైన మిద్దెతోట సాగు చేపట్టారు చాట్రాయికి చెందిన గోళ్ళ విశ్వేశ్వరరావు, శేషకుమారి దంపతులు. గతంలో మార్కెట్ నుంచి కూరగాయలు ఆకుకూరలు కొనుగోలు చేసి ఉపయోగించేవారు. అవి తినడం వలన అనేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఆసుపత్రులకు ఎంతో డబ్బు ఖర్చు పెట్టేవారు. దీంతో వీరికి మిద్దెతోట ఆలోచన వచ్చింది. స్థానిక చెరువు నుంచి సారవంతమైన మట్టి తెచ్చి ఇంట్లో ఉన్న పనికిరాని డబ్బాలు, డ్రమ్ముల్లో మట్టిని నింపి వివిధ రకాల కూరగాయలు ఆకుకూరలు పూలు విత్తనాలు నాటారు. ఎటువంటి రసానిక ఎరువులు, పశువుల పేడ మాత్రమే ఉపయోగిస్తూ సాగు చేపట్టారు. వంగ, బెండ, దొండ, టమాటా మొదలైన కూరగాయలు, పాలకూర, తోటకూర, బచ్చలి , కొత్తిమీర, పుదీనా మొదలైన ఆకుకూరలు పండిస్తున్నారు. తమ కుటుంబ అవసరాలకు పోను మిగిలినవి స్నేహితులకు ఉచితంగా ఇస్తున్నారు. -చాట్రాయి

ఆరోగ్యంగా జీవిస్తున్నాం





ఇప్పుడంతా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడి పండించిన కూరగాయలే తినాల్సి వస్తోంది. దీని వల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయి. మేము కూడా చాలా ఇబ్బందులు పడ్డాం. ఆసుపత్రుల చుట్టూ తిరిగి శారీరకంగా, ఆర్థికంగా నష్టపోయాం. కుటుంబ ఆరోగ్యం కోసం ఈ మిద్దె తోట సాగు చేపట్టాం. రోజు రెండ గంటల పాటు మిద్దెతోటలో పనిచేయడం వల్ల ఆరోగ్యం మెరుగైంది. కల్తీలేని కూరలు తింటున్నాం. కుటుంబ సభ్యులందరికి ఆరోగ్య సమస్యలు తగ్గిపోయాయి. ఆసుపత్రులకు వెళ్ళే అవసరం కూడా తగ్గింది.

- గోళ్ళ విశ్వేశ్వరరావు, శేషకుమారి, దంపతులు, చాట్రాయి.



కోట మహిషమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

నూజివీడు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు కోట మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయంలో హుండీ ఆదా యాన్ని నూజివీడు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈవో అలివేణిశ్రీ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించగా రూ.3,11,968లు ఆదాయం లభించి నట్లు ఆమె తెలిపారు. కాగా హుండీ ఆదా యం లెక్కింపుపై బుధవారం అనేక విమర్శలు తలెత్తాయి. ఉదయం 9.30 గంటలకు హుండీ ఆదాయం లెక్కిస్తామన్న అధికారులు ప్రధాన హుండీ తాళం తేకపోవడంతో స్వచ్ఛందంగా హుండీ ఆదాయం లెక్కించేందుకు వచ్చిన వారు 2 గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. మరో వైపు ఉపాలయంలోని శివాలయంలో హుండీని తెరచినా పర్యవేక్షణకు సంబంధించిన పోలీస్, రెవెన్యూ అధికారులు లేకుండానే ఆదాయం లెక్కించడం పలు విమర్శలకు తావిస్తుంది.

రేపటి నుంచి గ్రామ సభలు

చాట్రాయి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల భూసమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 18 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. 18న పర్వతాపురం, 19న పోతనపల్లి, 22న బూరుగ్గూడెం, 23న కొత్తగూడెం, 24న చిత్తపూరు గ్రామ సచివాలయాల్లో సభలు జరుగుతాయని, ఎటువంటి భూసమస్యలు ఉన్నా అర్జీ అందజేస్తే 15 రోజుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

ఏవోగా ఛాయాకుమారి

ముసునూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ నూతన ఏవోగా దావులూరి ఛాయాకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం నుంచి ఆమె బదిలీపై ముసునూరు వచ్చారు. ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న కె.సాయిరాము ఎ.కొండూరు మండలం బదిలీపై వెళ్ళారు. ఆయనను ఎంపీడీవో రాణి, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సన్మానించారు. నూతన ఏవోకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

పాడితో ఆర్థిక ఆసరా

చాట్రాయి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఒడిదుడుకులు ఎదురైనా, పాడి పరిశ్రమ రైతు కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని తుమ్మగూడెం, చిత్తపూరు శివారు కమ్మటూరు పాల సహకార సంఘాలను బుధవారం ఆయన సందర్శించి పాలకవర్గ సభ్యులు, పాడి రైతులతో మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో వరద బీభత్సానికి పాల ఫ్యాక్టరీ మునిగి విపత్కర పరిస్థితులు ఎదురైనా పాల సేకరణ, అధిక ధర చెల్లింపు, రైతులకు బోనస్ చెల్లింపు ఆపకుండా కొనసాగించామన్నారు. సంస్థ డైరక్టర్ బొట్టు రామచంద్రరావు, క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి, సంఘాల అధ్యక్షులు పొన్నగంటి శ్రీనివాసరావు, మండలపు పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలపై అవగాహన

ఆగిరిపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి దివ్యాంగుల కేంద్రంలో అభ్యసనా సామర్థ్యాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆగిరిపల్లి మండల విద్యాధికారి-2 ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే చదవటం, రాయటంలో లోపాలను గుర్తించి దాన్ని సరిచేసి ముందుకు సాగేలా చూడాలని వివరించారు. ఫిజియో థెరపిస్ట్ జి.ప్రశాంతి, ఐఈఆర్టీలు ఝాన్సీరాణి, రజిని, అంగన్‌వాడీ సిబ్బంది, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ

ఆగిరిపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్ కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం తన సిబ్బందితో కలసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. అలాగే సైబర్ నేరగాళ్ళు సోషల్ మీడియా ద్వారా ఫోన్లకు లింకులను గాని మెసేజ్‌లు గానీ పంపితే ఓపెన్ చేయవద్దని కోరారు. తాము సీబీఐ అధికారులమని చెప్పి బెదిరింపులకు దిగితే వెంటనే 1930కి ఫోన్‌చేసి తెలపాలని ప్రజలను కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఆగిరిపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆగిరిపల్లి మండలానికి చెందిన దొండపాటి రాజమణి (55) ఈ నెల 12న తన బంధువైన దొండపాటి సుబ్బారావు ద్విచక్రవాహనంపై వెళుతుండగా వాహనం అదుపుతప్పి ఇద్దరూ పడిపోగా వీరిని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమణిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై శుభశేఖర్ దర్యాప్తు చేస్తున్నారని ఏఎస్సై తాబేరియా నాయక్ తెలిపారు.



ఆధ్యాత్మిక శోభ

విద్యుద్దీపాల కాంతుల్లో తూర్పురాజగోపురం.. కల్యాణ వేదికను తీర్చిదిద్దుతున్న సిబ్బంది..

కల్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధం

నేటి రాత్రి 8 గంటల చిన వెంకన్న నుంచి కల్యాణం

ద్వారకాతిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని దివ్య కల్యాణ మహోత్సవానికి దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. అనివేటి మండపంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపాన్ని ముస్తాబు చేస్తున్నారు. పూల అలంకరణ పనులు గురువారం సాయంత్రానికి పూర్తవుతాయని ఆలయ ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. శ్రీహరి కళా తోరణ వేదికపై ప్రతీ నిత్యం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. స్వామి వారి తిరువీధి సేవకు వినియోగించే వెండి గరుడ వాహనాన్ని ఇప్పటికే సిద్ధం చేశారు. గురువారం రాత్రి 8-00 గంటలకు ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు.

హనుమద్వాహనంపై శ్రీవారు..

భక్తవరదుడైన శ్రీవారు హనుమద్వాహనాన్ని అధిష్ఠించి బుధవారం ఉదయం తిరువీధుల్లో ఊరేగారు. ధనుర్బాణాలను ధరించి రామావతారంలో కొలువుతీరిన శ్రీవారు హనుమంత వాహనంపై భక్తజన రంజకంగా తిరువీధుల్లో ఊరేగారు.

నేత్రపర్వం.. ఎదుర్కోలు మహోత్సవం

స్వామివారి కల్యాణానికి ముందురోజున ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయం. శ్రీవారి ఆలయ ఆవరణలో వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో స్వామి నిత్యకల్యాణ వేదిక వద్దకు వచ్చారు. అర్చకులు హారతులిచ్చి ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. మండపంలో అర్చకులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, కొనియాడగా రెండవ జట్టు అమ్మవార్ల గుణగణాలను తెలియజేశారు.వివాహం జరిగే ముందురోజు వధూవరుల తరపు బంధువులు శుభలేఖను పఠించేందుకు జరిపే కార్యక్రమమే ఎదుర్కోలు ఉత్సవం. రాత్రి వెండిశేష వాహనంపై స్వామివారు ఊరేగారు..

సీసీ కెమెరాల నిఘాలో ఎంఎల్ఎస్ పాయింట్లు



కైకలూరులో పౌరసరఫరాల గోదాము పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

కైకలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల గోదాములు ఇకపై సీసీ కెమెరాల నిఘాలో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. బుధవారం కైకలూరు పౌర సరఫరాల గోదామును తనిఖీ చేశారు. రేషన్ బియ్యం బస్తాలను తూచి బరువు పరిశీలించారు. పంచదార ప్యాకెట్లు చిరిగి, చీమలు పట్టడంతో స్థానిక అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పంచదార బస్తాలను వేరువేరుగా లాట్లు కట్టాలని ఆదేశించారు. వాటిని రీప్లేస్ చేయాలన్నారు. గోదాముల నుంచి వెళ్లే నిత్యావసర వస్తువులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చాల ని, రేషన్ డిపోలకు సక్రమంగా చేరేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నత్తగుల్ల పాడు రేషన్ షాపును పరిశీలించి రికార్డులకు బియ్యం నిల్వలకు వ్యత్యాసం ఉండడంతో కేసు నమోదు చేయాలని ఆదేశించారు. వడ్లకూటితిప్ప, పందిరిపల్లిగూడెం గ్రామాల్లో రేషన్ దుకాణాలను ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం తనిఖీ చేసి తక్షణమే రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఇకపై పౌర సరఫరాల గోదాముల్ని పర్యవేక్షిస్తామని, రేషన్ డిపోలను ఆకస్మిక తనిఖీలు చేస్తామని ఎవరైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

జేసీ ధాత్రి రెడ్డి

పౌర సరఫరాల గోదాము తనిఖీ

ముదినేపల్లిలో చౌకధరల దుకాణాల తనిఖీ

ముదినేపల్లి: జేసీ ధాత్రి రెడ్డి బుధవారం సాయంత్రం పేరూరు, దాకరం చౌక ధరల దుకాణాలను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సత్యనారాయణరాజు, తహసీల్దార్ సుబానీతో కలసి తనిఖీ చేశారు. రెండు దుకాణాల్లోను బియ్యం, పంచదార ప్యాకెట్ల స్టాకులో తేడా గుర్తించారు. ఆయా డిపోలపై చర్యలకు కేసులు నమోదు చేస్తున్నట్లు డీఎస్ఓ సత్యనారాయణ రాజు తెలిపారు. అన్ని చౌక డిపోల వద్ద ధరల బోర్డులను ఏర్పాటు చేయించాలని, ఎండీయూ వాహనాల పనితీరును పరిశీలించాలని తహసీల్దార్‌ను జేసీ ఆదేశించారు. అంతకు ముందు ఆమె పెదపాలపర్రులో పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఉద్దేశించిన స్థలాన్ని పరిశీలించారు.





దొడ్డిపట్లలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కామినేని.. పెనుమల్లిలో కార్మిక శాఖ డీసీ శ్రీనివాస్ శంకుస్థాపనలు

పల్లెల ప్రగతితోనే దేశాభివృద్ధి

» ఎమ్మెల్యే కామినేని » పల్లెలకు పండుగలో రహదారులకు శంకుస్థాపనలు

కైకలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లెల ప్రగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం వరహాపట్నం, సీతనపల్లి, దొడ్డిపట్ల, రామవరం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రానున్న రోజుల్లో గ్రామాల్లో అన్ని మట్టిరోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తామని, గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి పెడతామన్నారు. నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రరావు, పేరిచర్ల ప్రసాదరాజు, కాజా కృష్ణకుమార్, శ్రీను, వేటుకూరి పెద్దిరాజు, సర్పంచ్‌లు ఉప్పలపాటి నాగమణి, చెరుకువాడ బలరామరాజు, అధికారులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు పేదలకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్, ముదినేపల్లి మండల ప్రత్యేక అధికారి పి.శ్రీనివాస్ అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన పెనుమల్లిలో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడుతూ గ్రామాల్లోని అంతర్గత రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఒక ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందన్నారు. ఎంపీడీవో వై.రామకృష్ణ, సర్పంచ్ జంగం వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ అనగాని నాగమల్లేశ్వరరావు, పంచాయతీ సభ్యులు, ఈవోపీఆర్డీ అశోక్, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: పల్లెల్లో వెలుగులు నింపటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అండ్రాజు శ్రీనివాస్ అన్నారు. బుధవారం మట్టగుంటలో పల్లె పండుగ సందర్భంగా సర్పంచ్ అండ్రాజు రత్నమణి ఆధ్వర్యంలో రూ.15.4 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. టీడీపీ నాయకులు అండ్రాజు దుర్గారావు, నాగిడి వీరబ్రహ్మం, తిరుమాని పాండురంగారావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఏఈఈ బి.శ్రీనివాస్, ఉపాధి ఏపీవో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



మట్టగుంటలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న అండ్రాజు శ్రీనివాస్

సగం మంది విద్యార్థులు కూడా రాకపోతే ఎలా ?!

వివరణ కోసం 53 హైస్కూళ్ల హెచ్ఎంలకు పిలుపు

ఏలూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యార్థుల హాజరు 50 శాతం కంటే తక్కువగా వున్న 53 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా జిల్లా విద్యాశాఖ జారీ చేసిన మెమో ఉత్తర్వులు బుధవారం ఉపాధ్యాయ వర్గాల్లో కలకలం రేపాయి. మంగళవారం రాత్రి జారీచేసిన మెమో ఉత్తర్వులకు వేగంగా స్పందించిన 46 హైస్కూళ్ళలో బుధ వారమే విద్యార్థుల హాజరును హెచ్ఎంలు, టీచర్లు సంతృప్తికర స్థాయికి పెంచగా, మిగతా 7 ఉన్నత పాఠశాలల హెచ్ఎంలను మాత్రం వివరణ నిమిత్తం డీఈవో కార్యాలయానికి బుధవారం సాయంత్రం పిలిపించుకుని మాట్లాడారు. ఈ విషయంకాస్తా ఉపాధ్యాయ సంఘాలకు తెలియడంతో విద్యాశాఖ తీరుపై విరుచుకు పడ్డాయి. ఓ వైపు పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్, అపార్ నెంబర్లకోసం కంప్యూటర్ సెంటర్ల చుట్టూ తిరుగుతుంటే హాజరు తక్కు వగా ఉందంటూ విద్యాశాఖ అధికారులు మాన సికంగా వేధించడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు రామారావు, రెడ్డిదొర మండిపడ్డారు. పిల్లలను పాఠశాలకు పంపాల్సిన బాధ్యత తల్లితండ్రులదేనని, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు కాకుండా బోధనకే ఉపయోగించాలని డిమాండ్ చేశారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్ల హాజరుపై రెండువారాల క్రితం జిల్లాలవారీగా విద్యాశాఖ ఉన్నతాధి కారులు సమీక్షించి ఎక్కడెక్కడ లోపాలు వున్నదీ స్పష్టత నిస్తూ, దసరా సెల వులు ముగిసిన తర్వాత ఈ లోపాలను సరి దిద్దాలని డీఈవోలకు సూచించారు. ఆ ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 2.65 లక్షల మంది బాల, బాలికలు చదువుతుండగా, వీరిలో సుమారు 67 వేలమంది రోజూ ఏదో ఒక కారణంతో గైర్హాజర వుతున్నట్టు గుర్తించినట్టుగా వివరించారు. అదే సమయంలో జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో దాదాపు 100 మంది నిత్యం పాఠశాల తరగతులు ప్రారంభ మయ్యే ఉదయం 9 గంటల్లోగా ముఖ ఆధారిత గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) హాజరు వేయకుండా, 9.30 గంటల సమయంలో హాజరు వేయడాన్ని గైర్హాజరుగానే పరిగణిస్తామన్నారు. ఈ నేప థ్యంలో దసరా సెలవులు ముగియడంతో విద్యా ర్థుల హాజరుపై తొలుత జిల్లావిద్యాశాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే జిల్లాలో 53 హైస్కూళ్లలో విద్యార్థుల హాజరు 50 శాతం కంటే తక్కువగా వున్నట్టు గుర్తించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల హాజరును పెంచ డానికి హెచ్ఎంలను బాధ్యులుగా చేయాలని భావించింది. వరుసగా నాలుగు రోజులు స్కూలుకు గైర్హాజరయ్యే విద్యార్థి తల్లితండ్రు లకు క్లాసు టీచరు నేరుగా ఫోన్ చేసి తెలియ జేయాలని విద్యాశాఖ సూచించింది.

90-95 శాతం హాజరుండాల్సిందే : డీఈవో

"విద్యార్థుల హాజరుశాతం 50 శాతం కంటే తక్కువగా వున్న 53 పాఠశాలల హెచ్ఎంలను వివరణ కోరాం. వీరిలో 46 స్కూళ్ళ ప్రధానోపాధ్యాయులు బుధవారం నాటికి ప్రగతి కనబరిచారు. మిగతా ఏడు హైస్కూళ్ళ హెచ్ఎంలను పిలిపించి మాట్లాడాం. దసరా సెలవుల మరసటి రోజులైనందున విద్యార్థుల హాజరు తక్కువగా ఉందని వివరణ ఇచ్చారు. ప్రతి పాఠశాలలో 90 నుంచి 95 శాతం వరకు విద్యార్థుల హాజరుండేలా చూడాల్సిన బాధ్యత స్కూలు హెచ్ఎంలదే. ఉపాధ్యాయుల హాజరు వారి జీతంతో ముడిపడి వున్నందున సకాలంలోనే హాజరు వేయాలి. టీచర్లలో ఒకశాతం మంది సకాలంలో హాజరు వేయడం లేదని గుర్తించాం. దీనిని సరిచేసు కుంటారని ఆశిస్తున్నా." అని డీఈవో అబ్రహం వివరణ ఇచ్చారు.

మండల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గాభవాని

ముసునూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని, వైస్ ఎంపీపీ రాజా అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ మాట్లాడుతూ సమావేశానికి పూర్తి స్థాయిలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకాకపోతే గ్రామాల్లో సమస్యలెలా పరిష్కా రమవుతాయని ప్రశ్నించారు. ఏవో ఎస్.మధు మోహన్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే బిందు సేద్యం పరికరాలకు దరఖా స్తులు చేసుకోవాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా మాట్లాడుతూ ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల్లో ప్రసవాలకు సంబంధించిన సామగ్రిని సమకూర్చాలని కోరారు. వెలుగు ఏపీఎం రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ. 3 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇవ్వగా, కూటమి ప్రభుత్వం ఒక్కో గ్రూప్‌కు రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో నూరాని మాట్లాడుతూ 24 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి, మంచినీటి ప్లాంట్‌లకు నిధులు మంజూరయ్యాయని, వీటి ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై తీర్మానాలు చేశారు. మాజీ ఎంపీపీ రావర్ల కృష్ణకుమారి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శర్మ, ఈవోపీఆర్డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

ముసునూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తక్షణమే తొలగించి స్వాధీనం చేసుకోవాలని కూటమి నాయకులు, స్థానికులు డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ నాయ కులు రంగు శ్రీనివాసరావు, ఉప్పే బాబి, ఆము దాల ఇసాక్, జనసేన నాయకుడు పాశం నాగబాబుతో పాటు స్థానికులు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేసి ఆక్రమణలపై ఎంపీడీవో జి.రాణికి ఫిర్యాదు చేశారు. కోమటికుంట చెరువు భూమిని ఆక్రమించి మామిడి మొక్కలు నాటారని, అలాగే చికెన్, లైవ్‌ఫిష్ దుకాణాలను నిర్మించారని తెలిపారు. గ్రామ శివారులో శ్మశానవాటికను కూడా ఆక్రమించి దుకాణాలు, వాగు పోరంబోకు భూమిని ఆక్రమించి షెడ్ వేశారని ఎంపీడీవోకు నాయకులు ఫిర్యాదు చేశారు.

భూ వివాదంపై విచారణ

ముదినేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైవాకలో కుర్మా జ్ఞాన సుందరమ్మ అనే వృద్ధురాలి అసైన్డ్ భూమి అన్యాక్రాంతం అయిందని అందిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. 1969లో తన భర్త షద్రక్ పేరున ప్రభుత్వం 1.29 ఎకరాల అసైన్డ్ భూమికి ఇచ్చిన పట్టా ప్రకారం చాలా కాలం సాగు చేశామని, తన భర్త మరణానంతరం వేరే వ్యక్తులకు భూమిని కౌలుకు ఇవ్వగా, పట్టా తారుమారు చేసి వేరే వ్యక్తి పేరున అధికారులు మార్చేశారని ఇటీవల సుందరమ్మ సీఎం పేషీకి ఫిర్యాదు చేయగా, అక్కడి నుంచి అందిన ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. గతంలో పట్టా పొందిన సుందరమ్మను, ప్రస్తుతం ఆ భూమికి పట్టా కలిగి ఉన్న వెంకట సుబ్బమ్మను మంగళవారం తహసీల్దార్ ఎస్.కె.సుబానీ విచారించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.


కాంప్లెక్స్ ఎరువులు మితంగా వాడాలి

చాట్రాయి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు అధిక మోతాదులో కాంప్లెక్స్ ఎరువులు వాడవద్దని, జీవన ఎరువులు వాడుతూ, తగు మోతాదులో పురుగు మందులు పిచికారీ చేయటం వలన పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని వ్యవసాయాధికారి శివశంకర్ అన్నారు. మండలంలోని పోలవరంలో బుధవారం పొలం పిలుస్తోందిలో భాగంగా ఏవో రైతులతో కలిసి క్షేత్ర పరిశీలించారు. ఉద్యాన, పశు సంవర్థక శాఖలు సబ్సిడీపై అమలు చేస్తున్న డ్రిప్ పరికరాలు, శాశ్వత పందిర్లు మొదలైన పథకాలపై వివరించారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు రైతులు పాల్గొన్నారు.

కలిదిండి: సాగులో నూతన పద్ధతులు అవలం బించాలని మండల వ్యవసా యాధికారి విద్యాసాగర్ అన్నారు. వెంకటాపురంలో ఆయన మాట్లాడుతూ పాత పద్ధతులకు స్వస్తి పలకాలన్నారు. డ్రోన్ల ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచ్ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, అధికారులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: వరి సాగులో రైతులు ఆధునిక, సాంకేతిక యాజమాన్య పద్ధతులను అవలంబించాలని జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ లలిత సుధ తెలిపారు. గురజ, పెనుమల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో ఆమె మాట్లాడుతూ మట్టి నమూనాల పరీక్షలను నిర్వహించి భూసారాన్ని బట్టి సిఫార్సు చేసిన ఎరువులనే వినియోగించాలని కోరారు. మండవల్లి ఏడీఏ వెంకటమణి మాట్లాడుతూ విధిగా పచ్చిరొట్ట సాగు చేయాలని సూచించారు. ఏవో వేణుమాధవ్, వెటర్నరీ అధికారి డాక్టర్ క్రాంతి కుమార్, ప్రకృతి వ్యవసాయ విభాగం ఇన్‌చార్జ్ గౌతమ్ కుమార్, టీడీపీ నాయకుడు వీరిశెట్టి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

భారత్ టి-20 కెప్టెన్‌గా వాండ్రం కుర్రోడు తిలక్‌వర్మ



ఉండి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):వాండ్రం కుర్రోడు తిలక్‌వర్మ భారత్ టి-20 కెప్టెన్‌గా ఎంపికవడంపై ఉండి మండలం వాండ్రం గ్రామంలో ఆనందోత్సవాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం భారత్ జట్టును బీసీసీఐ ప్రకటించింది. అక్టోబరు 18 నుంచి ఒమన్ వేదికగా ఎమర్జింగ్ ఆసియా కప్ జరుగనుంది. టి-20 ఫార్మాట్‌లో జరుగునున్న ఈ టోర్నీకి 15 మందితో భారత జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు పశ్చిమగోదావరి జిల్లా వాండ్రం గ్రామం కుర్రోడు సారథ్యం వహించడంతో గ్రామంలో, మండలంలోని ప్రజలు, క్రికెట్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన భూపతిరాజు సుబ్బరాజు సుందరమ్మల మనువడు తిలక్‌వర్మ. తల్లిదండ్రులు గాయిత్రీ దేవి, నాగరాజు హైదరాబాద్‌లో నివాసం వుంటున్నారు. గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అభినందనలు తెలి పారు. తన మనువడు భారత జట్టుకు సారథ్యం వహించ డంపై తాత, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

కొత్త బ్రాండ్లతో ఖుషీ ఖుషీ



కైకలూరులో ఓ మద్యం దుకాణానికి ఎగబడిన మద్యం ప్రియులు

కైకలూరు, అక్టోబరు 16: మద్యం బ్రాండ్లు ఐదేళ్ళ తరువాత ప్రజలకు అందుబాటులో రావడంతో మందుబాబుల ఆనందానికి అవధుల్లేవు. బుధవారం నుంచి ప్రభుత్వం కొత్త పాలసీని అమలులోకి తీసుకువచ్చి మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అందజేశారు. దీంతో అనేక కొత్తకొత్త బ్రాండ్లతో అమ్మకాలు ప్రారంభించడంతో మొదటి రోజే మద్యం ప్రియులు పెద్దఎత్తున ఎగబడ్డారు. కైకలూరులో కోరుకొల్లు రోడ్డులో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద బుధవారం రాత్రి భారీ సంఖ్యలో మద్యం ప్రియులు కొనుగోలు చేసేందుకు రావడంతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. మిగిలిన దుకాణాలు ప్రారంభించక పోవడంతో ఈ దుకాణానికి క్యూకట్టారు.

చాట్రాయి: మండలంలోని చనుబండలో మంగళవారం ప్రైవేటు వైన్‌షాపు ప్రారంభమైంది. మండలంలోని చాట్రాయి, చనుబండలలో వైన్‌షాపులకు ప్రభుత్వం లాటరీలు నిర్వహించింది. చనుబండలో వైన్‌షాపు అమ్మకాలు ప్రారంభించగా, చాట్రాయి షాపు గురువారం ప్రారంభం కానున్నది.